ఇయ్యాల తెలంగాణ

IYYALATELANGANA

మన భాష – మన యాస

iyyalatelangana.com facebook.com/iyyalatelangana twitter.com/iyyalatelangana printerest./iyyalatelangana

హైదరాబాద్ శనివారం 07-11-2026 సంపుటి :13 సంచిక :97 పేజీలు 8 వెల. రూ॥ 4 /-

రేవంత్ ప్రభుత్వం దీపావళి కానుక, మరో హామీ అమలు – మార్గదర్శకాలు..!!



హైదరాబాద్, నవంబర్ 6: తెలంగాణ ప్రభుత్వం మరో పథకం అమలుకు సిద్ధమైంది. ప్రతీ కుటుంబానికి రూ 5లక్షల మేర జీవిత బీమా కల్పించాలని నిర్ణయించింది. వార్షిక బడ్జెట్ లో ప్రకటించిన విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం అమలు చేయనుంది. పథకం అమలులో భాగంగా మార్గదర్శకాలు సిద్ధం అయ్యాయి. ప్రతీ కుటుంబానికి ప్రయోజనం కలిగేలా ఈ పథకం పూర్తిగా ఉచితంగా ప్రభుత్వం అందించ నుంది. ఈ పథకం ప్రారంభానికి ముహూర్తం ఖరారు చేసింది. తెలంగాణలో రేవంత్ ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక పథకం అమలుకు సిద్ధం అయింది. దీపావళి కానుకగా ఈ పథకం అమలు ముహూర్తం ఖరారు చేసారు. ఈ నెల 19వ తేదీన మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఇందిరమ్మ బీమా పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించనుంది. ఈ మేరకు ముహూర్తం ఖారారు చేసింది. సిద్దిపేటలో జరగనున్న బహిరంగ సభలో ఈ కొత్త పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ పథకం ద్వారా కుటుంబ పెద్ద చనిపోతే కుటుంబసభ్యులకు రూ.5 లక్షల బీమా సొమ్ము అందుతాయి. ఏ కారణంతో మరణించినా ఈ బీమా సొమ్ము అందుతుంది. ఇందుకోసం ఇన్యూరెన్స్ కంపెనీలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. రేషన్ కార్డు ఉన్నవారు ఒక్క రూపాయి కూడా ప్రీమియం చెల్లించే అవసరం ఉండదు. ప్రభుత్వమే ఇన్సూరెన్స్ కంపెనీలకు ప్రీమియం చెల్లిస్తుంది. ఈ పథకం రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరా గాంధీ జన్మదినం అయిన నవంబర్ 19 నుంచి ప్రారంభం కానుంది. రేషన్ కార్డు ఉన్న వారందరికీ అమలు కాగా, ఈ పథకం అమలు కోసం నవంబర్ 20 నుండి 30 వరకు ప్రతి గ్రామంలో ఇందిరమ్మ కమిటీలు ఇంటింటికి వెళ్లి దరఖాస్తులను సేకరించేలా నిర్ణయం చేసారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1.15 కోట్ల కుటుంబాలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది. రేషన్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరూ ఈ బీమా సదుపాయానికి అర్హులుగా తేల్చారు. ఇందిరమ్మ కమిటీలు సేకరించిన దరఖాస్తులను ఆయా మండల తహశీల్దార్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు స్వీకరించి పరిశీలిస్తారు. అదే విధంగా నవంబర్ 19వ తేదీన మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆ రోజు నుంచి ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభం కానుంది. ఇప్పటికే అన్ని జిల్లాలకు ఇందిరమ్మ చీరలు పంపించారు. పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నాయి. దీంతో 19వ తేదీ నుంచి వీటి పంపిణీ చేపట్టేందుకు అధికారులు అన్నీ ఏర్పాట్లు చేశారు.

మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరల్లో భారీ తగ్గింపు



హైదరాబాద్, నవంబర్ 6: నగర ప్రయాణికులకు దీపావళి కానుకగా తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఇప్పటివరకు నెలవారీ ఉమ్మడి పాస్ ధర రూ.8,500 ఉండగా, దానిని ఏకంగా రూ.4,000కు తగ్గించారు. దీంతో ప్రయాణికులకు నెలకు రూ.4,500 వరకు ఆదా కానుంది. అలాగే.. రోజువారీ పాస్ ధరను కూడా రూ.400 నుంచి రూ.275కు తగ్గించారు. ధరల తగ్గింపుతో ప్రతిరోజూ మెట్రో, ఆర్టీసీ సేవలను వినియోగించే ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులకు ఆర్థిక భారం తగ్గనుంది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.కొత్త విధానం ప్రకారం.. రోజువారీ పాస్‌లో మెట్రో ప్రయాణానికి రూ.200, ఆర్టీసీ ప్రయాణానికి రూ.75 కేటాయించారు. ఈ పాస్ ద్వారా రోజుకు నాలుగు సింగిల్ జర్నీలు చేసుకునే అవకాశం కల్పించారు. ఇక నెలవారీ ఉమ్మడి పాస్‌తో గరిష్టంగా 50 రౌండ్ ట్రిప్పులు ప్రయాణించవచ్చు. తగ్గించిన కొత్త ధరలు నవంబర్ 8 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ వివరాలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. మెట్రో, ఆర్టీసీ సేవలను ఒకే పాస్‌తో వినియోగించుకునే వెసులుబాటుతో పాటు ధరలు తగ్గించడంతో నగర ప్రయాణికులకు మరింత ప్రయోజనం చేకూరనుంది.

ప్రభుత్వ పథకాల లబ్ధికి ఓటర్ ఐడీ..



బీజేపీపై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు

న్యూఢిల్లీ: కేంద్రంలో శాశ్వతంగా అధికారంలో కొనసాగేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎన్నికలను తారుమారు చేసి ప్రజల ఓటు హక్కును హరించేందుకు కుట్రలు పన్నుతోందని విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులను నిర్ధారించడానికి ఆధార్ కార్డులకు బదులుగా ఓటర్ ఐడీ కార్డులను ఉపయోగిస్తామని కేంద్ర మంత్రి లలన్ సింగ్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందిస్తూ బీజేపీపై విమర్శలు గుప్పించారు.ఆధార్‌కు బదులుగా ఓటర్ ఐడీ ఆధారంగా ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేయడం పౌరుల ప్రాథమిక హక్కులకు ముప్పు కలిగించవచ్చని ఎంపీ రాహుల్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ప్రయోజనాలను పొందడాన్ని ఓటర్ల జాబితాలతో ముడిపెడుతున్నారని, అయితే ఆ జాబితాలను ఇప్పటికే తారుమారు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీని వ్యతిరేకించే లేదా విమర్శించే లక్షలాది మంది పేర్లను తొలగించడానికి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను ఉపయోగిస్తున్నారని చెప్పుకొచ్చారు. బీజేపీని విమర్శించే వారిని లక్ష్యంగా చేసుకుని సంక్షేమ పథకాల ప్రయోజనాలను నిరాకరించే పరిస్థితి ఏర్పడవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. సర్ ప్రక్రియను ఆపకపోతే ఓటర్ల జాబితా నుంచి మరిన్ని పేర్లు తొలగించే అవకాశం ఉందని ఆరోపించారు. వారు బీజేపీపై ఆగ్రహంతో ఉన్న ప్రజలనే లక్ష్యంగా చేసుకుంటున్నారని రాహుల్ పేర్కొన్నారు.ఓటర్ల జాబితాలను ప్రభుత్వం తన నియంత్రణలోకి తీసుకుందన్న రాహుల్.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పాత్రనూ ప్రశ్నించారు. 'ఓటర్ల జాబితాలు నిష్పక్షపాతంగా వ్యవహరించే ఎన్నికల సంఘం చేతిలో ఉండాలి. కానీ, ఇప్పుడు అవి మోదీ ప్రభుత్వ ఉద్యోగి జ్ఞానేశ్ కుమార్ చేతిలో ఉన్నాయి. ఓట్ల చోరీలో బీజేపీతో కుమ్మక్కైన ఆయనను ఆధారాలతో సహా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాం. ఎల్లప్పుడూ బీజేపీకే మెజారిటీ వచ్చేలా జాబితాను రూపొందించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పుడు అదే జాబితా మీకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందుతాయో లేదో నిర్ణయిస్తుంది. ఇది హైజాక్ చేయబడిన ప్రజాస్వామ్యం. ఇక్కడ ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం లేదు, ప్రభుత్వమే తనకు అనుకూలమైన వ్యక్తులను ఎన్నుకుంటోంది' అని రాహుల్ విమర్శించారు.కాగా, రాహుల్ గాంధీ షేర్ చేసిన వీడియోలో కేంద్ర మంత్రి లలన్ సింగ్ మాట్లాడుతూ.. 'ఇకపై లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల చెల్లింపుల కోసం ఆధార్ కార్డు ప్రాతిపదికగా ఉండదు. ప్రతి వీధిలోని సంస్థల్లో ఇప్పుడు ఆధార్ కార్డు అందుబాటులో ఉంది. వారిని అడిగితే చాలు, ఐదు నిమిషాల్లో మీకు ఆధార్ కార్డును సిద్ధం చేసి ఇస్తారు. కాబట్టి, ఇకపై ఆధార్ కార్డు ప్రాతిపదిక కాదు. లబ్ధిదారులందరికీ చెల్లింపుల కోసం బయోమెట్రిక్, ఓటర్ ఐడీ (ఇఖఎఅ) నంబర్ ప్రాతిపదికగా ఉంటాయి. వాటి ఆధారంగానే చెల్లింపులు జరుగుతాయి' అని పేర్కొన్నారు.

తెలంగాణ కాంగ్రెస్ పంచాయతీలపై ఏఐసీసీకి టీపీసీసీ చీఫ్ నివేదిక



హైదరాబాద్, నవంబర్ 6: తెలంగాణ కాంగ్రెస్‌లో జరుగుతున్న పంచాయతీలపై ఏఐసీసీకి రిపోర్ట్ చేరింది. అన్ని పంచాయతీలపై ముందస్తు సమాచారంతో అధిష్ఠానానికి పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ రిపోర్ట్ పంపించారు. మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావులకు మధ్య జరిగిన వివాదంపై నివేదిక పంపారు. అలాగే కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపైనా రిపోర్ట్ పంపించారు. కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ అంశాన్ని హైకమాండ్‌కు చేరవేశారు. అంతేకాకుండా పెద్దపల్లిలో జరుగుతున్న పరిణామాలపై కాంగ్రెస్ అధిష్ఠానానికి పీసీసీ చీఫ్ రిపోర్ట్ పంపారు. త్వరలోనే అన్ని పంచాయతీలపై ఇరువర్గాలతో మాట్లాడి పూర్తి నివేదికను పీసీసీ చీఫ్ తయారు చేయనున్నట్లు తెలుస్తోంది.కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న ఇబ్బందులన్నింటినీ పరిష్కరించే యోచనలో టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ఉన్నట్లు తెలుస్తోంది. దాంట్లో భాగంగా పార్టీలో ఎక్కడెక్కడ గొడవలు, ఇబ్బందులు ఉన్నాయి.. అలాగే ఆధిపత్య పోరు ఎక్కడ ఉందనే దానిపై లిస్ట్ అవుట్ చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో ఢిల్లీ వేదికగా మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మధ్య నెలకొన్న వివాదాన్ని సర్దుమణిగించేందుకు ప్రయత్నం చేశారు. అయితే నిన్న కేబినెట్ సమావేశం ఉండటంతో మంత్రి దామోదర రాజనర్సింహ గాంధీభవన్‌కు రాలేదు.అలాగే.. పెద్దపల్లి కాంగ్రెస్ పంచాయతీ గాంధీభవన్‌కు చేరింది. ఎంపీ వంశీ కృష్ణ, మంత్రి శ్రీధర్ బాబు మధ్య చాలా రోజులుగా కోల్డ్ వార్ నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఈరోజు గాంధీభవన్‌కు రావాల్సిందిగా మంత్రి, ఎంపీని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆదేశించారు. వంశీ వర్గం నేతల సస్పెన్షన్, మంత్రి శ్రీధర్ బాబుకు ఎంపీ రాసిన లేఖ.. ఇద్దరి మధ్య తీవ్ర విభేదాలకు కారణంగా మారిందని చర్చ జరుగుతోంది. దీంతో ఇద్దరు నేతల మధ్య సయోధ్య కుదిర్చేందుకు పీసీసీ చీఫ్ ప్రయత్నిస్తున్నారు. ఈరోజు శ్రీధర్ బాబు, వంశీ గాంధీభవన్‌కు వస్తారా? లేదా అనే ఉత్కంఠ నెలకొంది.మరోవైపు నిధుల విడుదలలో జాప్యం విషయంలో కాంగ్రెస్ సర్కార్‌పై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను పార్టీ సీరియస్‌గా తీసుకుంది.

అమితాబ్ ఇంటికి మరోసారి బాంబు బెదిరింపు.. జల్సాలో పోలీసుల తనిఖీలు..

బాలీవుడ్ దిగ్గజ నటుడు అమితాబ్ బచ్చన్ నివాసానికి మరోసారి బాంబు బెదిరింపు రావడం కలకలం రేపింది. ముంబైలోని జుహూలో ఉన్న ఆయన నివాసం 'జల్సా'ను పేల్చివేస్తామంటూ గుర్తు తెలియని వ్యక్తులు ఈమెయిల్ పంపించారు. శుక్రవారం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో అప్రమత్తమైన ముంబై పోలీసులు జల్సాతో పాటు బెదిరింపు సందేశంలో పేర్కొన్న ఇతర ప్రాంతాల్లోనూ తనిఖీలు చేపట్టారు. అయితే ఎక్కడా అనుమానాస్పద వస్తువులు కనిపించకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు అమితాబ్ బచ్చన్ ఇంటికి బాంబు బెదిరింపు రావడం ఇది రెండోసారి. అక్టోబర్ 23న కూడా ఆయన నివాసాన్ని లక్ష్యంగా చేసుకుని గుర్తు తెలియని వ్యక్తులు బెదిరింపు ఈమెయిల్ పంపించారు. అక్టోబర్ 31 నుంచి నవంబర్ 27 మధ్య జుహూలోని జల్సాపై దాడి చేస్తామని అందులో హెచ్చరించారు. అంతేకాకుండా ఓ పాఠశాలపై గ్రెనేడ్ దాడి జరిగే అవకాశం ఉందని, ఖలిస్థాన్ ప్రస్తావన కూడా ఆ సందేశంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. తాజాగా వచ్చిన ఈమెయిల్‌లో అమితాబ్ బచ్చన్ నివాసంతో పాటు బాంబే హైకోర్టు, మహాలక్ష్మి రేస్‌కోర్స్ పేర్లను కూడా ప్రస్తావించారు ఈ నేపథ్యంలో పోలీసులు ఆయా ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు ఎక్కడా బాంబులు లేదా అనుమానాస్పద వస్తువులు లభించలేదు. బెదిరింపు సందేశం ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు పంపించారు



సీఎం రేవంత్‌పై అభిమానంతో 350 కి.మీ. పాదయాత్ర!

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుసుకోవాలన్న బలమైన ఆకాంక్షతో ఓ అభిమాని ఏకంగా కర్నూలు జిల్లా ఆదోని నుంచి కాలినడకన హైదరాబాద్ చేరుకున్నారు. ఆదోనికి చెందిన తాయన్న దాదాపు 350 కి.మీ. మేర కాలినడకన ప్రయాణించి, జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రిని కలుసుకుని తన అభిమానాన్ని చాటుకున్నారు. అక్టోబర్ 29న కర్నూలు జిల్లా ఆదోని నుంచి బయలుదేరిన తాయన్న, 9 రోజుల పాటు కాలినడకన ప్రయాణించి నేడు హైదరాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తాయన్నకు శాలువా కప్పి ఆత్మీయంగా అభినందించారు.



ఇయ్యాల తెలంగాణ IYYALATELANGANA మన భాష – మన యాస

సంపాదకీయం

స్వతంత్ర సంస్థలకు రాజకీయ క్రిమీడ

ప్రజాస్వామ్యానికి కాపలాదారులు గా ఉండాల్సిన రాజ్యాంగ నంస్థలు పాలకుల రాజకీయ వంజరంలో బందీలైతే ప్రజాస్వామ్యానికి సమాధి కట్టినట్టే! అధికారానికి ఊడిగం చేయడానికి కాదు సంస్థలున్నది.. రాజ్యాంగాన్ని కాపాడటానికే. ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకోసారి ఎన్నికలు పెట్టడం, ఓట్లు లెక్కింపు, ఫలితాలు ప్రకటించడమే కాదు.. అధికారంలో ఉన్న వారిని ప్రశ్నించే వ్యవస్థలుగా ఉండాలి.పాలకుల నిర్ణయాలకు అడ్డుకట్ట వేయగల స్వతంత్రసంస్థలుగా ఉండాలి. అధికార దుర్వినియోగాన్ని నిలదీయగలగాలి. కానీ నేడు దేశంలో స్వతంత్ర సంస్థల స్వయంప్రతివత్తిపై జరుగుతున్న చర్చలు ప్రజాస్వా మ్యానికి పెను హెచ్చరికగా మారుతున్నా యి. సంస్థలు స్వతంత్రంగా పనిచేయాల్సిన చోట ప్రభుత్వ నీడలో నడుస్తున్నా యనే అనుమానాలు బలపడితే అది కేవలం ఒక సంస్థ ప్రతిష్ఠకు సంబంధించిన సమస్య కాదు. దేశ ప్రజాస్వామ్య పునాదులకే ప్రమాద ఘంటిక.రాజ్యాంగ సంస్థలు అధికారంలో ఉన్న ప్రభుత్వానికి ఊడిగం చేయడానికి ఏర్పడిన కార్యాలయాలు కావు. ప్రభుత్వ నిర్ణ యాలకు గుడ్డిగా తలూపే ముద్ర వేసే యంత్రాలు అంతకంటే కావు. ప్రజల ప్ర యోజనాలను, రాజ్యాంగ విలువలను కా పాడాల్సిన బాధ్యత వాటిపై ఉంది. అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా నిర్ణ యాలు తీసుకుంటేనే స్వతంత్ర సంస్థలుగా గుర్తింపు వస్తుందా? ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిజాన్ని చెప్పే ధైర్యం లేకపోతే ఆ సంస్థలకు స్వయంప్రతిపత్తి ఉన్నట్టా? పాలకులే జవాబు చెప్పాలి. స్వతంత్రత అనేది ప్రభుత్వానికిచ్చే కానుక కాదు. అది ప్రజాస్వామ్యం కల్పించిన రాజ్యాంగ బాధ్యత.పథకాలు చూడండి2016లో జరిగిన పెద్ద నోట్ల రద్దు దేశ ఆర్థిక వ్యవస్థను కుదిపేసింది. సామాన్య ప్ర జలు బ్యాంకుల ముందు క్యూలో నిలబడ్డారు. చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపో యారు. పేదల జీవనాధారాలు దెబ్బతిన్నాయి. ఇంతటి కీలక నిర్ణయం విషయం లో రిజర్వ్ బ్యాంకు స్వతంత్రంగా వ్యవహరించిందా? ప్రభుత్వ నిర్ణయాన్ని లోతుగా పరిశీలించిందా? లేదా ముందే తీసుకున్న నిర్ణయానికి ఆమోదముద్ర వేసిందా? అనే ప్రశ్నలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు కాపలాదారుగా ఉండాల్సిన కేంద్ర బ్యాంకు ప్రభుత్వ నిర్ణయాల ముందు స్వతంత్రతను కోల్పోతే సామాన్యుడి ఆర్థిక భద్రతకు దిక్కెవరు? ప్రభుత్వా నికి నచ్చిన నిర్ణయమే సరైనదని చెప్పే సంస్థకు స్వతంత్ర సంస్థ అనే పేరెందుకు? ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైనది ఓటు. ఆ హక్కును కాపాడాల్సిన ది ఎన్నికల సంఘం. అది ఏ ఒక్క రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉండకూడదు. అధికార పార్టీకి ఒక కొలమానం, ప్రతిపక్షానికి మరో కొలమానం ఉంటే అది నిష్పక్షపాత అనిపించుకోదు. ఎన్నికల కోడ్ అందరికీ సమానంగా వర్తించాలి. అధికార బలం, ధనబలం, రాజకీయ పలుకుబడి ఎన్నికల ను ప్రభావితం చేయకుండా చూడాలి. ఈసీ నిర్ణయాలపై ప్రజల్లో అనుమానాలు పెరగడం అంటే ప్రజాస్వామ్యంపై ప్రజల నమ్మకం సన్నగిల్లుతుంది. స్వతంత్ర సంస్థల స్వేచ్ఛను దెబ్బతీసే మొదటి అడుగు వాటి నియామకాల నుం చే మొదలవుతుంది. కీలక పదవుల్లో ఎవరిని నియమిస్తున్నారు?వారి అర్హత ఏంటి? వారి ఎంపికలో పారదర్శకత ఉందా? రా జకీయ విధేయతకు ప్రాధాన్యతనిస్తున్నా రా? అనే ప్రశ్నలు తప్పనిసరిగా రావాలి. అధికార పార్టీకి అనుకూలమైన వ్యక్తులనే కీలక పదవుల్లో నియమిస్తే భవిష్యత్తులో ఆ సంస్థలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటాయనే నమ్మకం ఎలా కలుగుతుం ది? అందుకే నియామక ప్రక్రియలో అధికార, ప్రతిపక్షాల భాగస్వామ్యం, పారదర్శ కత, అర్హతలకు ప్రాధాన్యముండాలి. సం స్థల పునాదులనే రాజకీయ ప్రయోజనాలతో కలుషితం చేస్తే వాటి నుంచి నిష్ప క్ష పాతాన్ని ఆశించడం వగటికలే అవుతుంది.స్వయంప్రతిపత్తి అంటే ప్రశ్నించడానికి వీల్లేని అధికారం కాదు. ప్రభుత్వ జోక్యం ఉండకూడదన్న పేరుతో సంస్థలు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి వీల్లేదు. అధికార దుర్వినియోగం జరిగినా, నిర్ణయాల్లో తప్పులు దొర్లినా, ప్రజా ప్ర యోజనాలకు విరుద్ధంగా వ్యవహరించినా ప్రశ్నించే వ్యవస్థ ఉండాలి. ప్రజాస్వామ్య పర్యవేక్షణ, పార్లమెంటరీ సమీక్ష, న్యాయపరమైన పరిశీలనకు సంస్థలు జవాబు దారీగా ఉండాలి. కానీ ఈ పర్యవేక్షణ రాజకీయ కక్షసాధింపుకు ఆయుధంగా మార కూడదు. ప్రభుత్వ పెత్తనం ఒక ప్రమాదమైతే, జవాబుదారీతనం లేని స్వతంత్రత మరో ప్రమాదం. ఈ రెండింటి మధ్య రా జ్యాంగ సమతుల్యతే ప్రజాస్వామ్యానికి రక్షణ.దేశంలో అధికారాలు శాశ్వతం కావు. ప దవులు శాశ్వతం కావు. ప్రభుత్వాలు శాశ్వ తం కావు. కానీ రాజ్యాంగం శాశ్వత విలువలతో నిలబడాలి. నేడు అధికారంలో ఉన్నవారు రేపు ప్రతిపక్షంలో ఉండవచ్చు. అందుకే తమకు అనుకూలంగా ఉన్నప్పుడు సంస్థల స్వతంత్రతను సమర్థిస్తూ, ప్రతికూల నిర్ణయాలు వచ్చినప్పుడు వా టిపై దాడి చేసే ద్వంద్వ వైఖరిని రాజకీయ పార్టీలు విడనాడాలి. ప్రజాస్వామ్యం అం టే పాలకుల ఇష్టమే చట్టం కాదు. ప్రజల హక్కులే దాని ప్రాణం. రాజ్యాంగ సంస్థలు పాలకుల కరతాళ ధ్వనులకు అనుగుణం గా పనిచేసే వేదికలుగా మారితే ప్రజాస్వా మ్యం కేవలం ఎన్నికల తంతుగా మిగిలిపోతుంది.రాజకీయాలు చూడండిఎన్నికల సంఘం కావచ్చు, రిజర్వ్ బ్యాంకు కావచ్చు, మరే ఇతర రాజ్యాంగ సంస్థ కావచ్చు.. వాటి విధేయత ప్రభుత్వాల పట్ల కాదు, రాజ్యాంగం పట్ల ఉండా లి. వాటి నిర్ణయాలకు ప్రాతిపదిక రాజకీ య ప్రయోజనాలు కాదు, ప్రజా ప్రయోజనాలు కావాలి. అధికారాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడం పాలన కాదు. ప్రశ్నలకు సమాధానం చెప్పడం, విమర్శలను స్వీకరించడం, తప్పులను సరిదిద్దుకోవడమే ప్రజాస్వామ్య పరిపక్వత.

ఓలా, ఉబర్ లకు దీటుగా విన్ గ్రూప్



హైదరాబాద్, నవంబర్ 6, (న్యూస్ పల్స్)తెలంగాణలో ఎలక్ట్రిక్ మొబిలిటీని ప్రోత్సహించడంతోపాటు విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా 2025 డిసెంబరు 9న తెలంగాణ ప్రభుత్వం, వియత్నాంకు చెందిన విన్‌గ్రూప్ మధ్య సుమారు 3 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా ఎలక్ట్రిక్ మొబిలిటీ, క్యాబ్ సేవలు, ఛార్జింగ్ కేంద్రాలు, స్మార్ట్ సిటీ అభివృద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. విన్‌గ్రూప్‌లో భాగమైన గ్రీన్ ఎస్ఎం ప్రధానంగా ఎలక్ట్రిక్ వాహనాలతో రవాణా సేవలను నిర్వహిస్తోంది. ఇప్పటికే 2026 జూన్ 5న ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో వెయ్యి ఎలక్ట్రిక్ కార్లతో కార్యకలాపాలు ప్రారంభించింది. భవిష్యత్తులో వాహనాల సంఖ్యను 10 వేలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. హైదరాబాద్‌లోనూ ఈ సంస్థకు చెందిన కార్లు కనిపిస్తుండటంతో స్థానికంగా కార్యకలాపాల విస్తరణపై ఆసక్తి నెలకొంది. ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో గ్రీన్ ఎస్ఎం క్యాబ్స్ కిలోమీటర్‌కు రూ.9 చొప్పున ఛార్జీ వసూలు చేస్తున్నట్లు డ్రైవర్లు చెబుతున్నారు. హైదరాబాద్‌లో ఓలా, ఉబెర్ వంటి సంస్థల్లో సాధారణంగా కిలోమీటర్‌కు రూ.15 నుంచి రూ.20 వరకు ప్రయాణ ఛార్జీలు ఉంటున్నాయి. అయితే ట్రాఫిక్, ప్రయాణ దూరం, డిమాండ్, వాహనం రకాన్ని బట్టి ఈ ధరలు మారుతుంటాయి. ఈ సంస్థలు డ్రైవర్ల ఆదాయం నుంచి 20 నుంచి 30 శాతం వరకు కమిషన్ తీసుకుంటున్నాయి. మరోవైపు ర్యాపిడో క్యాబ్స్ రోజువారీ సబ్‌స్క్రిప్షన్, చిన్న పాస్‌ల విధానం ద్వారా జీరో కమిషన్ మోడల్‌ను కూడా అందిస్తోంది. ఉ దాహరణకు రోజుకు రూ.3 వేల గ్రాస్ ఆదాయం వచ్చే క్యాబ్ డ్రైవర్ కంపెనీ కమిషన్ లేదా సబ్‌స్క్రిప్షన్ కింద రూ.100 నుంచి రూ.600 వరకు చెల్లించాల్సి వస్తోంది. పెట్రోల్, సీఎన్‌జీ కోసం రూ.700 నుంచి రూ.900, నిర్వహణ, టోల్ ఛార్జీల కోసం మరో రూ.200 నుంచి రూ.300 ఖర్చవుతున్నాయి. ఇవన్నీ పోను రోజుకు రూ.1,200 నుంచి రూ.1,600 వరకు మాత్రమే డ్రైవర్‌కు మిగులుతున్నట్లు అంచనా. ఈ పరిస్థితుల్లో గ్రీన్ ఎస్ఎం తక్కువ ధరలకు క్యాబ్ సేవలు అందిస్తే ప్రయాణికులు అటువైపు మళ్లే అవకాశం ఉందని డ్రైవర్లు భావిస్తున్నారు.తెలంగాణ గిగ్ వర్కర్స్ యూనియన్ 2026 ఫిబ్రవరిలో వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్రంలో సుమారు 1.5 లక్షల మంది క్యాబ్ డ్రైవర్లు ఉన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు వచ్చి పనిచేస్తున్న వారు మరో 15 వేల మంది వరకు ఉన్నట్లు డ్రైవర్లు చెబుతున్నారు. కొత్త సంస్థ తక్కువ ఛార్జీలతో మార్కెట్‌లోకి వస్తే ఈ భారీ డ్రైవర్ వ్యవస్థపై ఎలాంటి ప్రభావం ఉంటుందన్నది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఓలా, ఉబెర్ డ్రైవర్లు తమకు అనుకూలమైన సమయంలో యాప్‌లో లాగిన్, లాగౌట్ అయ్యే వెసులుబాటు కలిగి ఉన్నారు. కానీ గ్రీన్ ఎస్ఎం విధానంలో డ్రైవర్లను సంస్థ నేరుగా నియమించుకుని, కార్పొరేట్ ఉద్యోగుల తరహాలో నిర్దీత పని గంటలు, సంస్థ నిబంధనల ప్రకారం పనిచేయించనున్నట్లు తెలు స్తోంది.ఢిల్లీలో సంస్థ కార్యకలాపాల తరహాలో హైదరాబాద్‌లోనూ తొలి విడతలో వెయ్యి కార్లను ప్రవేశపెడితే ఒక్కో వాహనానికి ఒకటి లేదా రెండు షిఫ్టుల చొప్పున సుమారు వెయ్యి నుంచి 2 వేల మంది డ్రైవర్లు అవసరమవుతారని అంచనా. సంస్థ సొంతంగా డ్రైవర్లను నియమించుకునే విధానం అనుసరించనుంది. ఢిల్లీ కార్యకలాపాలకు సంబంధించి రోజుకు 12 గంటలు పనిచేస్తే నెలకు రూ.35 వేల జీతం ఇస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ ఆదాయాన్ని పొందేందుకు డ్రైవర్లకు కఠినమైన నిబంధనలు విధిస్తున్నట్లు సమాచారం. కేటాయించిన రైడ్‌లో కనీసం 90 శాతం అంగీకరించి పూర్తి చేయాలి. కస్టమర్ల నుంచి 4.8 రేటింగ్ సాధించాలి. బుక్ చేసిన ప్రయాణాన్ని మధ్యలో రద్దు చేయడానికి వీల్లేదు. ఢిల్లీలోని కొందరు డ్రైవర్లు ఈ నిబంధనలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ట్రాఫిక్ రద్దీ, దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడం, 10 నుంచి 12 గంటల పాటు నిరంతరంగా డ్రైవింగ్ చేయడం వల్ల అలసటకు గురవుతున్నామని చెబుతున్నారు. ఛార్జింగ్ కేంద్రాలు అందుబాటులో లేక సమయం వృథా అవుతోందని, ఆదాయ హామీ, చెల్లింపుల విషయంలోనూ సమస్యలు ఎదురవుతున్నాయని వాపోతున్నారు.

నాగార్జునసాగర్ వరదకాల్వలో విష రసాయనాలు..?

నల్గొండ నవంబర్ 6, (న్యూస్ పల్స్)నల్గొండ జిల్లా పెద్దవూర మండలంలోని నాగార్జునసాగర్ వరదకాల్వలో నీరు రంగు మారడం, జలచరాలు చనిపోయి తేలడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ట్యాంకర్లతో రసాయనాలు పారబోసినట్లు అనుమానిస్తున్నారు. ఈ కాల్వ ద్వారా జిల్లాలోని ఎనిమిది మండలాలకు తాగు, సాగునీరు అందుతోంది. నీటిపారుదల శాఖ అధికారులు కాల్వను పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్యాంకర్లను గుర్తించేందుకు పోలీసులు సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్నారు. రసాయనాల స్వరూపం, నీటిపై వాటి ప్రభావం ఇంకా తెలియాల్సి ఉంది.నల్గొండ జిల్లా పెద్దవూర మండలంలో నాగార్జునసాగర్ వరదకాల్వలో నీరు అకస్మాత్తుగా రంగు మారడం స్థానికంగా కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున ట్యాంకర్ల ద్వారా కాల్వలో రసాయనాలను పారబోసినట్లు గుర్తించడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. రసాయనాలు కలవడంతో కాల్వలోని నీటి రంగు మారడమే కాకుండా.. జలచరాలు చనిపోయి నీటిపై తేలడంతో పరిస్థితి తీవ్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాగునీరు, సాగునీటి అవసరాలకు ఉపయోగించే కాల్వలో ఈ ఘటన చోటుచేసుకోవడం ప్రజల్లో భయాందోళనలకు కారణమైంది.నాగార్జునసాగర్ వరదకాల్వ ద్వారా నల్గొండ జిల్లాలోని ఎనిమిది మండలాలకు తాగునీరు, సాగునీరు అందుతోంది. ఇలాంటి కీలకమైన నీటి వనరులో గుర్తుతెలియని రసాయనాలు కలవడం స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. కాల్వ నీటిపై ఆధారపడే ప్రజలు, రైతుల అవసరాల దృష్ట్యా ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నీటి నాణ్యతను పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. అయితే, కాల్వలో కలిసిన రసాయనాలు ఏంటి, వాటి ప్రభావం ఎంతవరకు ఉంటుందనే అంశాలు ఇంకా స్పష్టతకు రావాల్సి ఉంది.సమాచారం అందుకున్న నీటిపారుదల శాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని కాల్వ పరిసరాలను పరిశీలించారు. దాదాపు అర కిలోమీటరు మేర కాల్వను పర్యవేక్షించారు. కోదాడ?జడ్చర్ల జాతీయ రహదారికి సమీపంలోని కొత్తగూడెం ప్రాంతంలో, కాల్వకు సుమారు 15 మీటర్ల దూరంలో రసాయనాలను పారబోసినట్లు గుర్తించినట్లు నీటిపారుదల శాఖ ఏఈ మల్లయ్య తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.మరోవైపు.. కాల్వలో రసాయనాలు పారబోసిన వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. వరదకాల్వ వెంట గస్తీని పెంచడంతోపాటు, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించి ట్యాంకర్లను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పెద్దవూర ఎస్సై గోపాల్‌రావు తెలిపారు. రసాయనాలను ఎవరు, ఎందుకు పారబోశారనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. తాగు, సాగునీటికి ఉపయోగించే జలవనరుల్లో రసాయన వ్యర్థాలను పారబోయడం ప్రజారోగ్యంతోపాటు పర్యావరణానికి కూడా ముప్పుగా మారే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు.ఘటనకు బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవడంతోపాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నీటి వనరుల పరిసరాల్లో పర్యవేక్షణను మరింత పటిష్ఠం చేస్తామని చెబుతున్నారు.

కనిపించని అధికార పార్టీ ప్రభావం

వరంగల్ నవంబర్ 6, (న్యూస్ పల్స్)వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతున్నాయి. వరంగల్- ఖమ్మం- నల్గొండ, మహబూబ్‌నగర్- రంగారెడ్డి -హైదరాబాద్ నియోజకవర్గాలను కైవసం చేసుకోవడం ద్వారా తమ రాజకీయ ఆధిపత్యాన్ని చాటాలని అధికార కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇప్పటికే మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డిని, వరంగల్- ఖమ్మం- నల్గొండ స్థానానికి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అభ్యర్థులుగా ప్రకటించి ముందడుగు వేసింది. అయితే ఓటరు నమోదు ప్రక్రియలో మాత్రం కాంగ్రెస్ పార్టీ బాగా వెనుకబడినట్లు వార్తలు అందుతున్నాయి.ఎన్నికల పోరులో గెలుపోటములను ప్రభావితం చేసే అత్యంత కీలకమైన ఓటరు నమోదు ప్రక్రియ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ గడువు ముగిసినప్పటికీ, నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అఖా స్పష్టం చేశారు. గతంలో ఓటర్లుగా ఉన్నవారు సైతం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్న నిబంధన ఉండటంతో, పెద్ద ఎత్తున అర్హులను నమోదు చేయించడం పార్టీల ముందున్న అతిపెద్ద సవాలు.ఎమ్మెల్సీ ఎన్నికలను అత్యంత సీరియస్‌గా తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, ఓటరు నమోదుపై ప్రారంభం నుంచే పార్టీ శ్రేణులను అప్రమత్తం చేస్తూ వస్తున్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, యువతను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేసి బలమైన ఓటు బ్యాంకును సృష్టించుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయినా, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ కేడర్ ఆశించిన స్థాయిలో వేగం పుంజుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ నాయకత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఓటర్లను నమోదు చేయించడంలో కొంత నిర్లిప్తత ప్రదర్శించినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇతర పార్టీలతో పోలిస్తే, అధికారంలో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆశించినంతగా గ్రౌండ్ వర్క్ జరగలేదన్న గుసగుసలు పార్టీ వర్గాల్లోనే చర్చనీయాంశమయ్యాయి.ఓటరు నమోదులో కేడర్ వెనుకబడిందన్న వార్తలు, నివేదికలు అధిష్టానాన్ని అప్రమత్తం చేశాయి. దీంతో చివరి గడువు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ నాయకత్వం మరింత దూకుడు పెంచింది. పార్టీ శ్రేణులకు మరోసారి గట్టి హెచ్చరికలు జారీ చేస్తూ, మిగిలిన సమయంలోనైనా వేగంగా దరఖాస్తులు పూర్తి చేయించాలని ఆదేశించింది. కాలేజీలు, యూనివర్సిటీలు, ఉద్యోగ సంఘాలు, పట్టభద్రులూ అధికంగా ఉండే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించింది.నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానుండగా, ఆ తర్వాత డిసెంబర్ 10 వరకు అభ్యంతరాల స్వీకరణ, డిసెంబర్ 30న తుది జాబితా ప్రచురణ ఉంటుంది. తుది జాబితా వచ్చే వరకు కూడా దరఖాస్తులకు అవకాశం ఉన్నప్పటికీ.. ప్రారంభ దశలో జరిగిన జాప్యాన్ని పూడ్చడంపైనే ఇప్పుడు పార్టీ దృష్టి కేంద్రీకృతమైంది.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలంటే పార్టీ బలం ఒక్కటే సరిపోదు. వ్యక్తిగత ప్రభావం, మేధావుల నాడిని పట్టడం చాలా ముఖ్యం. ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే ప్రభుత్వ విధానాలకు ప్రజామద్దతు ఉందని భావించడానికి ఒక బలమైన సంకేతం దొరుకుతుంది.

ఓయూ జూడో చాంప్ లార్డ్స్ జట్టు



ఇయ్యాల తెలంగాణ నవంబర్ 06: ఉస్మానియా యూనివర్సిటీ అంతర్ కళాశాలల జూడో చాంపియన్ షిప్ టైటిల్ ను లార్డ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ? 15 పాయింట్లుతో సొంతం చేసుకుంది.ముఫఖం జా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ 9 పాయింట్లు , ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖైరతాబాద్ 6 పాయింట్లుతో రెండు మూడు స్థానాలను దక్కించుకున్నాయి. శుక్రవారం ఇంటర్ కాలేజ్ జూడో ఛాంపియన్‌షిప్‌లోముఫఖం జా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ, బంజారా హిల్స్, హైదరాబాద్, గులాం అహ్మద్ హాల్, ఓఏఅఖ, బంజారా హిల్స్, జరిగిన మ్యాచ్ లో60 కిలోల కంటే తక్కువ: 1. ఎండి. ఇబ్రహీం ? (జిడిసి, ఖైరతాబాద్) 2. ఎండి. సదాఫ్ అలీ (లార్డ్స్ ఇంగ్లండ్) 3. ఇ. చరణ్ ? (బిజెఆర్ ప్రభుత్వం) 3.. అబ్దుల్ ఖదీర్ జుంబాలి (బద్రుకా)66 కేజీల దిగువన: 1. షేక్ సోహెల్ (అరోరా పీజీ కాలేజ్) 2.షేక్ ముజ్తబా మొహియుద్దీన్ ? (ఓఏఇనిణ)3. ఓట. ముజ్తబా అజార్ హుస్సేన్ (ఎంఒ) 3. షేక్ ఇర్ఫాన్ ? (అన్వరుల్ ఉలూమ్)73 కేజీల దిగువన: అబ్దుల్ మాలిక్ బిన్ సలేహ్ బహవారీస్ (ఆఅఇ) 2.ఫర్హాన్ అహ్మద్ సిద్దిక్ ? (ఏఏఖీ) 3. ఖ. కార్తీక్ (ఉఆఅ, ఖైరతాబాద్) 3. అబ్దుల్ ముకీత్ ఫుజైల్ ? (అన్వరుల్ ఉలూమ్)81 కిలోల క్రింద:1. కె.గని శంకర్ (విశ్వభారతి) 2.ముజమ్మిల్ ఖాన్ (అమ్జద్ అలీ ఖాన్) 3. మహ్మద్ అబ్రార్ (ఎంజె ఇంజి) 3. షేక్ రియాన్ అకిఫ్ (లార్డ్ ఇంగ్లీషు)91 కిలోల క్రింద:1. మొహమ్మద్ అర్మాన్ అలీ (లార్డ్స్) 2. షేక్ మహ్మద్ అజ్ఫర్ ఆజం (సుల్తానులూమ్) 3. మిష్బా ఉస్ హసన్ రియాన్ (ఎంజె ఇంజి) 3. మహమ్మద్ తల్హా (నవాబ్ షా)100 కిలోల కంటే తక్కువ: 1. ఇబ్రహీం ఇషాక్ జాబ్రీ (లార్డ్స్) 2. మహమ్మద్ అబ్దుల్ నుమాన్ (ఓఏ ఇంజి) 3. హబ్బుల్లాన్ బుర్హానుద్దీన్ (అఒఇ) 3. ఫహద్ ఇక్బాల్ (నవాబ్ షా)100 కేజీలు ప్లస్:1. కె. సాయి శంకర్ (నిజాం) 2. సయ్యద్ అబ్దుల్ ముఖీత్ (నవాబ్ షహలం) 3. మహమ్మద్ సిద్దిక్ (ఎంజె ఇంజి) 3. అబ్దుల్ మోయిజ్ (లార్డ్స్) విజేతలకు లార్డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సుల్తానులులూమ్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి శ్రీ జఫర్ జావీద్, శారీరక విద్య విభాగం అధిపతి, ఓయూ టోర్నమెంట్ కార్యదర్శి సీనియర్ ప్రొఫెసర్ రాజేష్ కుమార్ తదితరులు బహుమతులను అందజేశారు.

ఎండిన ప్రతి ఎకరానికి ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలి

మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు



మెదక్,నర్సాపూర్ నియోజకవర్గ పర్యటనలో మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పర్యటించారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు రాక, సాగునీరు అందక చేతికొచ్చిన వరి పంటలు కళ్లముందే ఎండిపోయాయని హరీశ్ రావు ఎదుట రైతులు వాపోయారు. సకాలంలో కరెంటు అందక తన 7 ఎకరాల వరి పంట పూర్తిగా ఎండిపోయిందని కంటతడి పెట్టుకున్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు 24 గంటల నాణ్యమైన కరెంటుతో రెండు పంటలు పండించుకున్నాం.. ఇప్పుడు కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి నెలకొందని అన్నారు. వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు అప్పుల పాలవుతున్నా.. కనీసం ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా ఇటువైపు కన్నెత్తి చూడలేదని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రైతన్నలు అధైర్యపడకండి.. ఈ రెండేళ్లు సీఎం రేవంత్ రెడ్డి మెడలు వంచి రైతుల సమస్యలను పరిష్కరిస్తామని హరీశ్ రావు భరోసా ఇచ్చారు. మార్పు అంటే కేసీఆర్ ఇచ్చిన 24 గంటల కరెంటును, రైతుబంధును బంద్ పెట్టి పచ్చని పొలాలను ఎండబెట్టడమేనా అని హరీష్ రావు .. రేవంత్ ప్రభుత్వంపై ధ్వజం ఎత్తారు. ఎండిన ప్రతి ఎకరానికి ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చే వరకు పెండింగ్ రైతుబంధు, పూర్తిస్థాయి రుణమాఫీ చేసే వరకు కాంగ్రెస్ సర్కార్‌ను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

తులం బంగారం ఇంకెప్పుడు ఇస్తారు-తలసాని



సికింద్రాబాద్. నగరంలో నీటి సమస్య రోజురోజుకు ఎక్కువ అవుతుందని, రానున్న రోజుల్లో మరింత ఎక్కువ కొరత ఏర్పడే పరిస్థితి ఉన్నది. కాబట్టి ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలు అవస్థలు పడకుండా చూడాలని ప్రభుత్వానికి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హితవు పలికారు. సికింద్రాబాద్ ఎమ్మార్వో కార్యాలయంలో జరిగిన కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ కార్యక్రమంలో తలసాని ముఖ్య అతిదిగా హాజరై లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ లబ్ధిదారులు తులం బంగారం ఇంకెప్పుడు ఇస్తారని అడుగుతున్నారని తెలిపారు. ఇదే కాకుండా ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నా తమకు ఏమి పట్టనట్లు ప్రభుత్వం వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అనేక ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చిందని, మూడేళ్లు అవుతున్న అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు.

అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణచివేయలేరు.. బాలరాజు యాదవ్ అరెస్టుపై కేటీఆర్ ఆగ్రహం



హైదరాబాద్ ,బీఆర్ఎస్ నేత, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ అరెస్టుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలను ప్రశ్నించినందుకు బీఆర్ఎస్ నాయకుడిని అరెస్టు చేయడం ఏమిటని నిలదీశారు. రాజకీయ విమర్శలకు రాజకీయంగానే సమాధానం చెప్పాలని, పోలీసు కేసులతో అణచివేయాలని చూడటం సరికాదని మండిపడ్డారు.కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ భార్య ఇందుజా రెడ్డి ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ఫిర్యాదు మేరకు పోలీసులు బాలరాజు యాదవ్‌ను అరెస్టు చేశారు. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావుపై బల్మూరి వెంకట్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బాలరాజు యాదవ్ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ నేపథ్యంలో ఆయనపై అట్రాసిటీ కేసు నమోదు చేయడమేంటని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ అరెస్టుపై తాజాగా కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. అరెస్టు పేరుతో బాలరాజు యాదవ్‌ను నగరమంతా తిప్పుతూ ఆయన కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గమని విమర్శించారు. రాజకీయ విమర్శలకు సమాధానం రాజకీయంగానే చెప్పాలి తప్ప పోలీసు కేసులతో కాదని హితవు పలికారు.అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణచివేయలేరని కేటీఆర్ స్పష్టం చేశారు. బాలరాజు యాదవ్‌పై పెట్టిన కేసును తక్షణమే ఉపసంహరించుకుని, ఆయనను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని, అధికార పార్టీ నేతలను ప్రశ్నించే హక్కును కాలరాయలేరని పేర్కొన్నారు.


భూపాలపల్లిలో దారుణం.. ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య!

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించిన ఓ మహిళ.. ప్రియుడితో కలిసి కట్టుకున్న భర్తనే హత్య చేసిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కలకలం రేపింది. భూపాలపల్లి మండలం గొల్లబుద్ధారం (చిలకపల్లి) గ్రామానికి చెందిన అజ్మీరా చందు నాయక్ (39) హత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ హత్యకు మృతుడి భార్య పావని, ఆమె ప్రియుడు ధరావత్ సంతోష్ కారణమని పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం.వివరాల్లోకి వెళ్తే.. గొల్లబుద్ధారం గ్రామానికి చెందిన పావనికి ధరావత్ సంతోష్‌తో కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం తెలుసుకున్న భర్త చందు నాయక్ తరచూ భార్యతో గొడవపడేవాడు. దీంతో తమ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించిన పావని.. ప్రియుడు సంతోష్‌తో కలిసి అతడిని హతమార్చాలని పథకం వేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలినట్లు తెలిసింది.ఈ వ్యవహారంపై మూడు రోజుల క్రితం గ్రామంలో పంచాయితీ నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇందుకోసం స్థానిక సర్పంచ్‌ను చందు నాయక్ ఆశ్రయించగా.. శుక్రవారం పంచాయతీకి సమయం ఇచ్చింది. అయితే పంచాయితీలో తమ వివాహేతర సంబంధం విషయం బయటపడుతుందనే భయంతో పావని, సంతోష్ ముందుగానే చందు నాయక్‌ను హతమార్చాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటిగంట సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న చందు నాయక్‌పై దాడి చేసి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని ఎడ్లబండిలో తీసుకెళ్లి చిలకపల్లి గ్రామ శివారులో పడేశారు.గ్రామస్థుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. భూపాలపల్లి డీఎస్పీ ఏ. సంపత్ రావు, భూపాలపల్లి, గణపురం సీఐలు శ్రీనివాస్, కరుణాకర్ రావు, ఎస్సై పవన్ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. విచారణలో మృతుడి భార్య పావని, ఆమె ప్రియుడు సంతోష్ పాత్ర ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.. ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. హత్యకు ఉపయోగించిన వస్తువులు, ఘటనకు సంబంధించిన ఇతర ఆధారాలు, నేరంలో మరెవరైనా పాల్గొన్నారా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



తరుణ్ తేజ్‌పాల్‌కు సుప్రీంకోర్టులో షాక్..

దీపావళి బెయిల్ పిటిషన్ తిరస్కరణ



హైదరాబాద్ , తెహెల్కా మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు ఎదురుదెబ్బ తగిలింది. 2013 నాటి అత్యాచార కేసులో ఆయనకు విధించిన పదేళ్ల జైలుశిక్షను నిలిపివేయడానికి, దీపావళి సందర్భంగా మధ్యంతర బెయిల్ మంజూరు చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. తన శిక్షను నిలిపివేయాలని కోరుతూ తేజ్‌పాల్ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా.. జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బి వరాలేలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తనపై వచ్చిన అభియోగాన్ని, శిక్షను సవాల్ చేస్తున్న తేజ్‌పాల్‌కు ఉపశమనం కల్పించేందుకు తాము సుముఖంగా లేమని ధర్మాసనం పేర్కొంది.కాగా.. బాంబే హైకోర్టు తీర్పుపై తేజ్‌పాల్ దాఖలు చేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉండగా.. దీపావళి సందర్భంగా మధ్యంతర బెయిల్ కోరుతూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తేజ్‌పాల్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్.. దీపావళికి తేజ్‌పాల్‌ను ఇంటికి పంపేందుకు అనుమతించాలని అభ్యర్థించారు. అయితే.. ఈ వాదనల్ని గోవా ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వ్యతిరేకించారు.గోవాలో 2013 నవంబర్‌లో నిర్వహించిన థింక్‌ఫెస్ట్ కార్యక్రమం సందర్భంగా ఓ మహిళా సహోద్యోగిపై తరుణ్ తేజ్‌పాల్ లైంగిక దాడికి పాల్పడ్డారంటూ కేసు నమోదైంది. 2021లో తేజ్‌పాల్‌ను గోవా సెషన్స్ కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. అయితే.. ఈ తీర్పును ఆ రాష్ట్ర ప్రభుత్వం బాంబే హైకోర్టులో సవాల్ చేసింది. విచారణ అనంతరం హైకోర్టు ఆయన్ను దోషిగా తేల్చి.. వదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,21,000 జరిమానా విధిస్తూ 4 వారాల్లో లొంగిపోవాలని ఆదేశించింది. ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేశారు తేజ్‌పాల్. లొంగిపోవడం నుంచి తనకు తక్షణమే మినహాయింపు కల్పించాలని కోరారు. కానీ ఆయన అభ్యర్థనను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది.

బీహార్‌లో సంచలనం.. పోలీసుల ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు నిందితులు హతం!



బీహార్ రాష్ట్రంలోని పాట్నా జిల్లాలో తీవ్ర కలకలం రేపిన పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం) అధ్యక్షుడి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ హత్య కేసులో నిందితులుగా ఉన్న ముగ్గురు వ్యక్తులు.. పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో మరణించారు. మృతులను రాజేష్ శర్మ, బబ్లూ కుమార్, జేపీ యాదవ్‌గా పోలీసులు గుర్తించారు. మనేర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని షేర్‌పూర్ గంగా ఘాట్ సమీపంలో ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది.నిందితుల కదలికలపై సమాచారం అందుకున్న పోలీసులు వారిని పట్టుకునేందుకు అక్కడికి చేరుకోగా.. పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో పోలీసులకు, నిందితులకు మధ్య సుమారు 20 నిమిషాల పాటు హోరాహోరీగా కాల్పులు జరిగాయి. ఇరువైపుల నుంచి దాదాపు 30 రౌండ్ల వరకు తుపాకీ కాల్పులు జరిగినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. కాల్పుల శబ్దాలతో షేర్‌పూర్ గంగా ఘాట్ పరిసర ప్రాంతాల్లో భయాందోళన నెలకొంది. ఈ ఘటనలో ముగ్గురు నిందితులు తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారు.ఈ ఎదురుకాల్పుల్లో మనేర్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్ఓ) రజనీష్ కుమార్ కూడా తుపాకీ గుండు గాయానికి గురయ్యారు. కాల్పుల సమయంలో ఆయనకు బుల్లెట్ తగలడంతో వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. పీఏసీఎస్ అధ్యక్షుడి హత్య కేసులో ఈ ముగ్గురు నిందితుల పాత్రపై పోలీసులు ఇప్పటికే దర్యాప్తు చేపట్టగా, వారిని పట్టుకునే క్రమంలో ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్లు తెలుస్తోంది. ముగ్గురు నిందితులు మృతి చెందడంతో ఈ హత్య కేసు దర్యాప్తులో కీలక మలుపు చోటుచేసుకున్నట్లయింది. ఘ ఇరువైపుల నుంచి ఎన్ని రౌండ్ల కాల్పులు జరిగాయి, ఎన్‌కౌంటర్‌కు దారితీసిన పరిస్థితులు ఏమిటి, హత్య కేసులో మరికొందరి ప్రమేయం ఉందా అనే కోణాల్లో అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో పాట్నా జిల్లాలో భద్రతా చర్యలను పోలీసులు మరింత కట్టుదిట్టం చేశారు.

జార్ఖండ్‌లో ఘోర ప్రమాదం.. జనాలపైకి దూసుకెళ్లిన లారీ.. ఏడుగురి మృతి

జార్ఖండ్‌లోని ఖుంటి జిల్లాలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. రోడ్డు ప్రమాదానికి గురైన స్కూటీని పరిశీలించేందుకు అక్కడికి చేరుకున్న వారిపైకి వేగంగా వచ్చిన లారీ దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం.లారీ ఢీకొనడంతో పలువురు తీవ్రంగా గాయపడగా.. ఘటనాస్థలం వద్ద హృదయవిదారక పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఖుంటి సదర్ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారిని పాకో దేవి, కసిలా దేవి, మన్సు దేవి, గోలు కుమార్, అంజలి కుమారి, తూటీ కుమారి, సౌరభ్ నాయక్‌గా గుర్తించారు. ఒకే ప్రమాదంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడంతో వారి కుటుంబాల్లో విషాదం అలుముకుందిప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరారైనట్లు సమాచారం. అతడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మొదట స్కూటీ ప్రమాదం ఎలా జరిగింది? ఆ తర్వాత లారీ అక్కడున్న జనాలపైకి ఎలా దూసుకొచ్చింది? డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమా? అనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

పంజాబ్‌లో కర్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో భారీ అగ్నిప్రమాదం.. నాలుగు బోగీలు దగ్ధం

పంజాబ్: సరాయ్ బంజారా రైల్వే స్టేషన్ సమీపంలో ఘోర రైలు ప్రమాదం సంభవించింది. కర్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు చెందిన నాలుగు కోచ్‌లలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో నాలుగు బోగీలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. అయితే, ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అమృత్‌సర్ నుంచి న్యూ జల్పాయ్‌గురి వెళ్తున్న 12508 నంబర్ కర్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సరాయ్ బంజారా స్టేషన్ సమీపానికి రాగానే ఇంజిన్ నుంచి ఐదో బోగీలో తొలుత మంటలు కనిపించాయి. ఆ తర్వాత మరో మూడు బోగీలకు వ్యాపించాయి. దీంతో రైలులోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి రైలును నిలిపివేయడంతో ప్రయాణికులంతా సురక్షితంగా దిగిపోయారు.ప్రయాణికులు పెను ముప్పు నుంచి తప్పించుకోవడంతో భారీగా ప్రాణనష్టం తప్పింది. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, అత్యవసర సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. రైలు బోగీల్లో పెద్దఎత్తున మంటలు ఎగసిపడుతుండటంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. ఘటనపై విచారణ చేపట్టిన అధికారులు షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అయితే, ప్రమాదానికి కచ్చితమైన కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.



ఎఫ్ఎంజీ వైద్యులపై పోలీసుల ఉక్కుపాదం.. నిరసనకారులను ఈడ్చుకెళ్లి అరెస్టు!



తమకు స్టైపెండ్ పెంచాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న విదేశీ వైద్య విద్యార్థుల (ఈఓఈ) ఇంటర్న్‌లపై పోలీసులు కఠినంగా వ్యవహరించారు. కోఠిలోని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (ఆఓఇ) కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులను పోలీసులు ఈడ్చుకెళ్లి అరెస్టు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తమకు నెలకు రూ.29,792 స్టైఫండ్ చెల్లించాలని, జనవరి 2026 నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.తెలంగాణలోని వివిధ ప్రభుత్వ వైద్య కళాశాలల పరిధిలోని బోధనాసుపత్రుల్లో ఎఫ్ఎంజీ ఇంటర్న్‌లు విధులు నిర్వహిస్తున్నారు. స్థానికంగా ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులతో సమానంగా వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ తమకు నెలకు కేవలం రూ.5 వేల స్టైపెండ్ మాత్రమే చెల్లిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర వైద్య ఇంటర్న్‌లతో సమానంగా రూ.29,792 చెల్లించాలని కోరుతున్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం విదేశీ వైద్య విద్యార్థులు చేపట్టిన ఆందోళన శుక్రవారానికి 30వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా హైదరాబాద్ కోఠిలోని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ కార్యాలయం సమీపంలో రిలే నిరాహార దీక్షను ప్రారంభించారు. శుక్రవారం రెండో రోజు కూడా రిలే నిరాహార దీక్ష కొనసాగించారు. ఈ క్రమంలో డీఎంఈ కార్యాలయం వద్ద నిరసన తెలిపిన వైద్యులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది.జనవరి 2026 నుంచి పెండింగ్‌లో ఉన్న స్టైపెండ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఇంటర్నషిప్ పొడిగింపు పేరుతో ఇబ్బందులకు గురిచేయకుండా ప్రభుత్వం హామీ ఇవ్వాలని ఎఫ్ఎంజీ వైద్యులు కోరుతున్నారు. తమపై ఎలాంటి కక్షపూరిత చర్యలు తీసుకోకూడదని, స్థానిక ఎంబీబీఎస్ విద్యార్థులతో సమానంగా స్టైపెండ్ అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.మరోవైపు శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులతో ఈ అంశంపై చర్చలు జరిపినట్లు సమాచారం. ఎఫ్ఎంజీ ఇంటర్న్‌ల న్యాయమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని సమస్యను పరిష్కరించాలని వైద్యులు, వైద్య రంగానికి చెందిన పలువురు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ఢిల్లీ వెదర్ ఎంజాయ్ చేస్తున్నారనుకుంటా.. చమత్కరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: నేషనల్ క్యాపిటల్ రీజియన్(ఎన్సీఆర్) ప్రాంతంలో నెలకొన్న వాయు కాలుష్య సంక్షోభంపై ఇవాళ సుప్రీంకోర్టులో వాదనలు జరిగాయి. పంట వ్యర్థాలను సేకరించే విధానాన్ని, ధరను ముందే ప్రకటించాలని సుప్రీంకోర్టు చెప్పింది. దీనికి సంబంధించిన మేనేజ్మెంట్ వ్యవస్థను రూపొందించాలని పేర్కొన్నది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, వీ మోహనతో కూడిన ధర్మాసనం ఈ కేసులో వాదనలు విన్నది. ఢిల్లీలో కాలుష్య నియంత్రణ చర్యలు అమలు చేస్తున్న నేపథ్యంలో చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ .. బహుశా ఢిల్లీ వెదర్‌ను అందరూ ఎంజాయ్ చేస్తున్నారని అనుకుంటానని అన్నారు. అయితే బెంచ్ ముందు సీనియర్ లాయర్ అపరాజిత సింగ్ రియాక్ట్ అవుతూ.. ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్ర స్థాయిలోనే ఉందన్నారు. తన గొంతుపై ఆ ప్రభావం ఉన్నట్లు ఆమె చెప్పారు.ఈ ప్రాంతంలో గాలి పీల్చడం అంటే రోజుకు 30 సిగరెట్లు తాగినదానితో సమానం అవుతుందని ఆమె అన్నారు. వర్షం వల్ల కూడా కాలుష్యం కాస్త తగ్గినట్లు చెప్పారు. వచ్చే సీజన్ కోసం రైతులు ప్రిపేర్ కావడం వల్ల పంట వ్యర్థాలను కాల్చడం కూడా ఆగినట్లు తెలుస్తోందని సుప్రీం తెలిపింది. అయితే ఢిల్లీ కాలుష్యంలో 14 శాతం పంటలు కాల్చడం వల్లే వస్తుందని సింగ్ తెలిపారు. ఢిల్లీ ఇప్పటికే తీవ్రమైన కాలుష్యంతో నిండి ఉన్నదని, దీనికి తోడు పంట వ్యర్థాలు కాల్చడం వల్ల సమస్య మరింత జఠిలం అవుతోందన్నారు. పంట వ్యర్థాలను సేకరించేందుకు ఓ వ్యవస్థను రూపొందించామని, మరి వాహనాలు, హైఎండ్ కార్ల సంగతి ఏంటని సుప్రీంకోర్టు అడిగింది.ట్రాన్స్‌పోర్టేషన్ వల్లే ఢిల్లీలో అధిక కాలుష్యం నమోదు అవుతోందని సింగ్ తెలిపారు. వెహికల్ పొలుషన్ పెద్ద సమస్యగా మారిందని, రోడ్లపై ట్రాఫిక్ బంపర్ టు బంపర్ ఉందని సీజే సూర్యకాంత్ అన్నారు.



ఎండిపోయిన ప్రతి ఎకరానికి నష్టపరిహారం ఇవ్వాల్సిందే.. హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్ ,కాంగ్రెస్ ప్రభుత్వ విద్యుత్ కోతల కారణంగా వేలాది ఎకరాల్లో వరి పంటలు ఎండిపోయాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని చిలిపిచెడ్, హత్నూర మండలాల్లో ఎండిపోయిన వరి పంట పొలాలను ఆయన సందర్శించారు. పంటలు నష్టపోయిన రైతులను పరామర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు అప్పుల పాలవుతున్నా కనీసం ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా అటువైపు కన్నెత్తి చూడటం లేదని ఈ సందర్భంగా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని హరీశ్ రావు ఎదుట వాపోయారు. రైతుబంధు పథకం కింద పూర్తిస్థాయిలో సాయం అందలేదని, కేవలం ఒక్క ఎకరానికే డబ్బులు వేసి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేతులు దులుపుకుందని ఆరోపించారు.రేవంత్ రెడ్డి ప్రకటించిన రైతు రుణమాఫీ కూడా బోగస్ అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామంలో పది మందిలో కనీసం ఒక్కరికైనా రుణమాఫీ కాలేదని వాపోయారు. కాంగ్రెస్ పార్టీ ఇతగబచ్చిన హామీలను నమ్మి మోసపోయామని, మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం వస్తేనే తమ కష్టాలు తీరుతాయని హరీశ్ రావు వద్ద పేర్కొన్నట్లు బీఆర్ఎస్ వెల్లడించింది.

ఇయ్యాల తెలంగాణ

టీపీసీసీ కంట్రోల్ చేయలేకపోతున్నారే...

హైదరాబాద్, నవంబర్ 6, (న్యూస్ పల్స్)తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అంతర్గత కలహాలు, క్రమశిక్షణా రాహిత్యం పరాకాష్టకు చేరాయి. ప్రభుత్వం ఏర్పాటై మూడేళ్లు గడుస్తున్నా, పార్టీ యంత్రాంగాన్ని ఏకతాటిపై నడిపించడంలో పిసిసి పూర్తిగా విఫలమవుతోంది. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎవరికి వారే యజమానులుగా వ్యవహరిస్తూ, బహిరంగంగా ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటున్నా అడిగే నాథుడే కరువయ్యాడు. కాంగ్రెస్ అంటేనే ప్రజాస్వామ్యం.. ఇక్కడ స్వేచ్ఛ ఎక్కువ అంటూ ప్రతి సందర్భంలోనూ సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, అసలు కాంగ్రెస్‌లో క్రమశిక్షణ అనే పదానికి అర్థమే లేకుండా పోతోందని సొంత పార్టీ శ్రేణులే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.పార్టీలో ఒకరి తర్వాత ఒకరు క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడుతున్నా వారిని సరైన దారిలో పెట్టలేకపోవడానికి పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేతకానితనమే ప్రధాన కారణమని గాంధీ భవన్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. స్వతహాగా బలమైన ప్రజాదరణ లేని నాయకుడిగా ముద్రపడిన మహేష్ గౌడ్, కనీసం తనకు దక్కిన పిసిసి అధ్యక్ష పదవి ద్వారా వచ్చే పవర్‌ను కూడా ఉపయోగించలేకపోతున్నారు. సీనియర్ నేతలు నిబంధనలు ఉల్లంఘిస్తున్నా, పబ్లిక్ వేదికలపై పార్టీ ప్రతిష్టను దిగజారుస్తున్నా కేవలం నోటీసులతో కాలయాపన చేయడం తప్ప, కఠినమైన చర్యలు తీసుకునే నైతిక ధైర్యం ఆయనలో కనిపించడం లేదు.పిసిసి చీఫ్ కనబరుస్తున్న ఈ బలహీనమైన వైఖరిపై పార్టీలోని ఒక బలమైన వర్గం తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతోంది. డిసిసి అధ్యక్షుల ఎంపిక నుంచి ప్రభుత్వం-పార్టీ సమన్వయం వరకు ప్రతి విషయంలోనూ మహేష్ గౌడ్ దిగువ స్థాయి ఒత్తిళ్లకు లొంగిపోతున్నారని, అధిష్టానంతో ఉన్న సాన్నిహిత్యాన్ని కూడా పార్టీ ప్రయోజనాల కోసం ఉపయోగించలేకపోతున్నారని విమర్శిస్తున్నారు. ఒకవైపు బిఆర్ఎస్, బిజెపిలు క్షేత్రస్థాయిలో దూకుడు పెంచుతుంటే, పీసీసీ అధ్యక్షుడు మాత్రం పార్టీలోని వ్యతిరేకత స్వరాలను అదుపు చేయలేక చేతులెత్తేయడం ప్రభుత్వ ఇమేజ్‌పై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది.సొంత నియోజకవర్గాల్లో నేతల ఆధిపత్య పోరు, మంత్రివర్గ సభ్యులు-ఎమ్మెల్యేల మధ్య ఘర్షణలు నిత్యకృత్యంగా మారినా పీసీసీ స్పందించకపోవడం రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పెద్ద దెబ్బగా మారే ప్రమాదముంది. క్రమశిక్షణ విధింపులో జవాబుదారీతనం లేకపోతే ప్రజాస్వామ్యం అనే ముసుగులో పార్టీ కట్టుబాట్లు పూర్తిగా కూలిపోతాయని సీనియర్లు హెచ్చరిస్తున్నారు. ఇకనైనా పీసీసీ చీఫ్ తన శైలిని మార్చుకుని ఉక్కుపాదం మోపకపోతే, తెలంగాణ కాంగ్రెస్‌లో ఈ ఆధిపత్య పోరు కాస్తా నియంత్రించలేని దావానలంగా మారుతుందన్న అసంతృప్తి కనిపిస్తోంది.

కాఫీ షాపీల్లోనూ ఆఫీసు వర్క్...

బెంగళూరు, నవంబర్ 6, (న్యూస్ పల్స్)కాఫీ షాపులను కొందరు తాత్కాలిక ఆఫీసులుగా మార్చుకుంటున్నారు. కస్టమర్లకు ఇది సౌకర్యంగా ఉన్నా కేఫ్ యజమానులకు తలనొప్పిగా మారుతోంది. బెంగళూరులో ఓ కేఫ్ యజమాని ఎదుర్కొంటున్న సమస్య ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కేవలం రూ.150 కాఫీ ఆర్డర్ చేసి, గంటల తరబడి టేబుళ్లను ఆక్రమించుకుంటున్న కస్టమర్ల వల్ల వ్యాపారం దెబ్బతింటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారుబెంగళూరులోని ఇందిరానగర్‌లో ఓ వ్యక్తి రూ 60 నుంచి 70 లక్షలు పెట్టుబడి పెట్టి కెఫె ప్రారంభించారు. వ్యాపారం ప్రారంభించిన కొద్ది రోజులకే ఓ సమస్య ఎదురైంది. అక్కడికి వచ్చే కస్టమర్లు కేవలం రూ.150 విలువైన ఒక కప్పు కాఫీ మాత్రమే ఆర్డర్ చేస్తున్నారు. ఆ తర్వాత ల్యాప్‌టాప్‌లు తెరిచి గంటల తరబడి అక్కడే కూర్చుంటున్నారు. కొన్నిసార్లు రోజంతా కూడా టేబుళ్లను ఆక్రమించుకుంటున్నారు.కేఫ్‌లోని టేబుళ్లన్నీ ఇలా గంటల తరబడి కస్టమర్లతో నిండిపోవడంతో కొత్తగా వచ్చే వారికి కూర్చోవడానికి స్థలం ఉండటం లేదు. దీంతో చాలా మంది కెఫెలోకి వచ్చి సీట్లు ఖాళీగా లేకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. ఒకవైపు కాఫీ ఆర్డర్ చేసిన కస్టమర్లను వెళ్లిపోవాలని చెప్పలేరు. అలా చెబితే వారు గూగుల్‌లో నెగెటివ్ రివ్యూ ఇచ్చే అవకాశం ఉంది. దానివల్ల కెఫెకు నష్టం కలుగుతుందని యజమాని ఆందోళన చెందుతున్నారు.ప్రముఖ కాఫీ చైన్లు స్టార్‌బక్స్, అఅఅ, థర్డ్ వేవ్ లో కాఫీ, స్నాక్స్ ధరలు ఎక్కువగా ఉంటాయి. కస్టమర్లు కేవలం కాఫీ, స్నాక్స్ కోసమే డబ్బులు చెల్లించడం లేదు అక్కడ కూర్చుని గంటల తరబడి గడిపే సమయానికి పరోక్షంగా చెల్లిస్తున్నారు. కెఫెలో కూర్చునే స్థలానికీ ఓ ధర ఉంటుంది.ఈ పోస్టు వైరల్ కావడంతో నెటిజన్లు రకరకాల సూచనలు చేస్తున్నారు. కెఫెలో ఎంతసేపు ఉంటే అన్ని గంటలకు కనీసం ఒక కాఫీ ఆర్డర్ చేయాలనే నిబంధన పెట్టాలని ఓ నెటిజన్ సూచించారు. కాఫీ అమ్మడం కంటే కెఫెలో గడిపే సమయానికి డబ్బులు వసూలు చేసే విధానాన్ని తీసుకురావాలి. ఎక్కువ ధర చెల్లిస్తే మెరుగైన సీటింగ్, కాఫీ, స్నాక్స్ అందించవచ్చు అని మరికొందరు అన్నారు. కొన్ని కేఫెలలో ల్యాప్‌టాప్‌ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. కస్టమర్లు చేసే ఖర్చును బట్టి కెఫెలో ఉండే సమయాన్ని నిర్ణయించాలి. రూ.150 నుంచి రూ.750 వరకు బిల్లు ఉంటే గరిష్ఠంగా గంటన్నర, రూ.750 నుంచి రూ 1,500 వరకు బిల్లు ఉంటే రెండు గంటల సమయం ఇవ్వొచ్చు. వారంలో ఉదయం వేళల్లో ల్యాప్‌టాప్‌లతో పని చేసేందుకు అనుమతించి, సాయంత్రాలు, వారాంతాల్లో మాత్రం ఆంక్షలు విధించాలని మరో నెటిజన్ సూచించారు. మొత్తానికి కేఫెలలో కూర్చుని పని చేసేవారి సౌకర్యం ఒకవైపు వ్యాపార నిర్వహణ మరోవైపు ఈ రెండింటి మధ్య సమతుల్యత ఎలా సాధించాలన్న ప్రశ్న ఇప్పుడు చర్చకు దారితీసింది. కస్టమర్లకు స్వేచ్ఛ ఉండాలా? కెఫె యజమానులు సమయ పరిమితులు విధించాలా అన్నది ఆసక్తికరంగా మారింది.

అమెరికాలో నల్గొండ యువతి అదృశ్యం


నల్గొండ ,నల్గొండ జిల్లాకు చెందిన యువతి అమెరికా లో మిస్సింగ్ అయింది. కనగల్ మండలం శాబ్దులాపురం గ్రామం నుంచి యాదగిరిరెడ్డి?రూప దంపతుల కుమార్తె శ్రీజ (23) ఉన్నత చదువుల కోసం అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లింది. ఓ కళాశాలలో చదువుతూ పార్ట్‌టైమ్ జాబ్ చేస్తోంది. ఈ నెల 2వ తేదీన వాకింగ్‌కు వెళ్లి తిరిగి రాలేదని, ఫోన్ లొకేషన్ సమీపంలోని బీచ్ వద్ద చూపిస్తోందని తోటి విద్యార్థినులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మిస్సింగ్ కేసు నమోదయింది. పోలీసులు గాలింపులు చేసట్టారు. ఒక్కగానొక్క కుమార్తె అమెరికాలో అదృశ్యం కావడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

శరవేగంగా కుంభమేళ పనులు

భోపాల్, నవంబర్ 6, (న్యూస్ పల్స్) దేశంలో ప్రయాగ్‌రాజ్, హరిద్వార్, ఉజ్జయిని వంటి ప్రాంతాల్లో కుంభమేళా జరుగుతుండగా.. నాసిక్ కుంభమేళాకు ప్రత్యేకత ఉంది. ఇది నాసిక్‌తో పాటు త్రయంబకేశ్వర్‌లోనూ నిర్వహిస్తారు. 1838లో త్రయంబకేశ్వర్‌లో శైవ, వైష్ణవ సాధువుల మధ్య స్నానాల ప్రాధాన్యత విషయంలో ఘర్షణలు జరగడంతో అఖాడాలను వేర్వేరు ప్రాంతాలకు తరలించారు. అప్పటి నుంచి శైవ సాధువులు త్రయంబకేశ్వర్‌లోని కుశావర్త తీర్థం వద్ద.. వైష్ణవ అఖాడాలు నాసిక్‌లోని రామ్‌కుండ్, తపోవన్ ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించే సంప్రదాయం కొనసాగుతోంది.వచ్చే ఏడాది 3 ప్రధాన అమృత స్నానాలు జరగనున్నాయి. 2027 ఆగస్ట్ 2, ఆగస్ట్ 31, సెప్టెంబర్ 11వ తేదీల్లో జరగనున్నాయి. వీటితో పాటు నాసిక్‌లో 45, త్రయంబకేశ్వర్‌లో 29 శుభస్నాన తేదీల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2027 కుంభమేళా కోసం చేపట్టిన అభివృద్ధి పనులు కేవలం తాత్కాలిక ఏర్పాట్లకే పరిమితం కావడం లేదు. మొత్తం 350కిపైగా ప్రాజెక్టులు చేపట్టగా.. వాటిలో దాదాపు 85 శాతం శాశ్వత మౌలిక సదుపాయాలుగా నిర్మిస్తున్నారు. కుంభమేళా ముగిసిన తర్వాత కూడా నాసిక్, త్రయంబకేశ్వర్ ప్రాంతాల ప్రజలకు ఇవి ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందించారు. కుంభమేళాతో పోలిస్తే ఈసారి మౌలిక సదుపాయాల కోసం పెట్టే వ్యయం దాదాపు 10 రెట్లు అధికమని కుంభమేళా మంత్రి గిరీశ్ మహాజన్ తెలిపారు. 2027 వేడుకలను పరిశుభ్రంగా, సురక్షితంగా, సమర్థంగా నిర్వహించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గత కుంభమేళా ఎలాంటి ప్రాణనష్టం లేకుండా ప్రశాంతంగా ముగిసిన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రవాణా వ్యవస్థను విస్తరించడంపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా దాదాపు 150 కిలోమీటర్ల మేర రహదారులను విస్తరించి, ఆధునికీకరిస్తున్నారు. గోదావరి, దాని ఉపనదులపై కొత్తగా 8 వంతెనలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కుంభమేళా సమయంలో భారీగా తరలివచ్చే భక్తుల రాకపోకలను సులభతరం చేయడం వీటి ప్రధాన ఉద్దేశం. ఇక నాసిక్ నగర ట్రాఫిక్ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం చూపేలా 65.6 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డును నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.7,613 కోట్ల వ్యయం అంచనా వేశారు. రింగ్ రోడ్డు పూర్తి అయితే నగరంలోకి వచ్చే వాహనాల రద్దీ తగ్గడంతో పాటు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు.కుంభమేళాలో పవిత్ర స్నానాలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. ఈ నేపథ్యంలో నాసిక్‌లో గోదావరి నది వెంట సుమారు 3.4 కిలోమీటర్ల పొడవున కొత్త ఘాట్లను నిర్మిస్తున్నారు. త్రయంబకేశ్వర్‌లోనూ అదనపు స్నాన ఘాట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. చారిత్రక ఆలయాలు, కుండాలను పునరుద్ధరిస్తున్నారు. త్రయంబకేశ్వర్ ఆలయ పట్టణాన్ని అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'శివ దర్శన్ పథ్' ప్రాజెక్టును చేపట్టారు. దీనివల్ల ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఆ ప్రాంత పర్యాటక ప్రాధాన్యత కూడా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.కోట్లాది మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించే గోదావరి నది పరిశుభ్రత ఈ కుంభమేళాలో అత్యంత కీలకమైన అంశం. నదిలోకి శుద్ధి చేయని మురుగునీరు చేరకుండా అడ్డుకునేందుకు నాసిక్‌లో భారీ మురుగునీటి నిర్వహణ ప్రాజెక్టును చేపట్టారు. ఇందులో భాగంగా 4 ఆధునిక మురుగునీటి శుద్ధి కేంద్రాలు, దాదాపు 200 కిలోమీటర్ల పొడవున మురుగునీటి పైప్‌లైన్లు నిర్మిస్తున్నారు. ఈ పనుల్లో సగానికిపైగా ఇప్పటికే పూర్తి అయ్యాయని నాసిక్ మున్సిపల్ కమిషనర్ మనీషా ఖాత్రీ తెలిపారు. కుంభమేళా ప్రారంభానికి ముందే మిగిలిన పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే నాసిక్ నగరంలో మురుగునీటి నిర్వహణ వ్యవస్థ మెరుగుపడటంతో పాటు గోదావరి కాలుష్యాన్ని నియంత్రించేందుకు దోహదపడతాయి.మహారాష్ట్రలో ఈ ఏడాది బలహీనమైన రుతుపవనాల కారణంగా పలు ప్రాంతాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో లక్షలాది, కోట్లాది మంది భక్తులకు అవసరమైన నీటిని అందించడం, స్థానిక ప్రజల అవసరాలను కూడా సమతుల్యం చేయడం అధికారులకు సవాలుగా మారనుంది. ముఖ్యంగా పుణ్యస్నానాల కోసం గోదావరిలో తగినంత నీటి లభ్యత ఉండేలా ముందస్తు ప్రణాళికలు అవసరం. భక్తుల అవసరాలు, నగరాల రోజువారీ నీటి అవసరాల మధ్య సమన్వయం సాధిస్తామని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం నిర్మిస్తున్న మౌలిక సదుపాయాలు కుంభమేళా ముగిసిన తర్వాత కూడా కనీసం 30 ఏళ్లపాటు ఈ ప్రాంతానికి ఉపయోగపడతాయని నాసిక్-త్రయంబకేశ్వర్ కుంభమేళా అథారిటీ కమిషనర్ శేఖర్ సింగ్ వెల్లడించారు. రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పర్యాటకం అభివృద్ధి చెందుతుందని, నాసిక్ అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా ఎదిగేందుకు ఈ ప్రాజెక్టులు తోడ్పడతాయని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా 2027 సింహస్థ కుంభమేళా ఆధ్యాత్మిక వేడుకగానే కాకుండా.. ఉత్తర మహారాష్ట్రలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కీలక మలుపుగా నిలవనుంది.

మళ్లీ బండి సంజయ్ కు పగ్గాలు !

కరీంనగర్, నవంబర్ 6, (న్యూస్ పల్స్)రాజకీయాల్లో మరోసారి బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి చుట్టూ ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని నెలల కిందట పార్టీ పగ్గాలు చేపట్టిన ఎన్. రామచంద్రరావును మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అధిష్టానం దాదాపు ఖరారు చేసింది. దీంతో రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు తిరిగి ఎంపీ బండి సంజయ్ చేతికి వెళ్లనున్నాయనే ఊహాగానాలు రాజకీయ వర్గాల్లో జోరుగా వినిపిస్తున్నాయి.2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండేవారు. అప్పట్లో బీజేపీ దూకుడు ఊహించని స్థాయిలో ఉండేది. ఆయన చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్ర పార్టీ



శ్రేణుల్లో జోష్ నింపింది. ఆ సమయంలో పార్టీ కేవలం జాతీయ స్థాయి పార్టీగానే కాకుండా, అధికార బీఆర్ఎస్‌కు ఏకైక ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగింది. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో చారిత్రాత్మక విజయాలు సాధించడంతో పాటు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ ఊహించని విధంగా ప్రతిపక్ష స్థానాన్ని దక్కించుకుని సంచలనం సృష్టించింది. సంజయ్ అనుసరించిన దూకుడు రాజకీయ శైలి, ప్రభుత్వ వైఫల్యాలపై నిరంతరం పోరాటం చేసే తీరు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేశాయి.అయితే, ఆయన దూకుడుతో పార్టీలో అంతర్గతంగా కొంత అసంతృప్తి చెలరేగడం, కొందరు సీనియర్ నేతలు హైకమాండ్‌కు ఫిర్యాదు చేయడం వంటి పరిణామాల నేపథ్యంలో ఎన్నికలకు ముందే ఆయనను ఆ పదవి నుంచి తప్పించి కిషన్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత పార్టీలో నాయకత్వ మార్పులు జరుగుతూ వచ్చాయి.ప్రస్తుత రాజకీయ సమీకరణాల దృష్ట్యా, రాష్ట్రంలో పార్టీ మళ్లీ పూర్వవైభవం సంతరించుకోవాలన్నా, కేడర్‌లో ఉత్సాహం రావాలన్నా బండి సంజయ్ లాంటి దూకుడుగల నాయకుడే కచ్చితంగా అవసరమని జాతీయ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. పార్టీలో కీలక వ్యూహకర్తగా ఉన్న సునీల్ బన్సాల్ తదితర పరిశీలకులు కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల అమిత్ షా హైదరాబాద్ పర్యటన సందర్భంగా తెలంగాణలో పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, అధ్యక్ష మార్పుపై ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. రామచంద్రరావుకు ఎమ్మెల్సీ బాధ్యతలు అప్పగిస్తే, ఖాళీ అయ్యే రాష్ట్ర అధ్యక్ష పీఠాన్ని మళ్లీ బండి సంజయ్‌కే కట్టబెట్టాలనే ప్రతిపాదనపై అధిష్టానం సానుకూలంగా ఉన్నట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.ఒకవేళ బండి సంజయ్‌కు మళ్లీ రాష్ట్ర పగ్గాలు దక్కితే తెలంగాణ రాజకీయాల్లో సమీకరణాలు వేగంగా మారే అవకాశం ఉంది. క్షేత్రస్థాయి కార్యకర్తలతో నేరుగా కనెక్ట్ అయ్యే నాయకుడిగా పేరున్న సంజయ్ రాకతో పార్టీ కేడర్‌లో మళ్ళీ కొత్త జోష్ వస్తుంది. అధికార కాంగ్రెస్ పార్టీ విధివిధానాలపై, వైఫల్యాలపై పోరాటాలు మరింత ఉధృతమయ్యే అవకాశం ఉంది. బీసీ వర్గానికి చెందిన బండి సంజయ్‌కు పగ్గాలు ఇవ్వడం ద్వారా పార్టీ సామాజిక వర్గాల సమీకరణలోనూ బలపడే అవకాశం ఉందనే అంచనాలున్నాయి.మొత్తానికి రాబోయే స్థానిక సంస్థలు, ఇతర ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీజేపీ హైకమాండ్ తీసుకునే ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలకు దారితీసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు కొత్త కళ..

హైదరాబాద్, నవంబర్ 6, (న్యూస్ పల్స్)సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.714.73 కోట్లతో పనులు చేపట్టగా.. ఇప్పటివరకు 71 శాతం పూర్తయ్యాయి. ఉత్తర, దక్షిణ వైపుల ఐకానిక్ భవనాలు, రెండు అంతస్తుల ఎయిర్ కాన్‌కోర్స్, ప్లాట్‌ఫారాలపై రూఫింగ్, ట్రావలేటర్లతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, మల్టీలెవల్ కార్ పార్కింగ్, మెట్రో స్కైవాక్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. కొన్ని కీలక నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. మిగిలిన పనులు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తయ్యే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే రైల్వే జంక్షన్లలో ఒకటైన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన సమగ్ర పునరాభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మొత్తం రూ.714.73 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఇప్పటివరకు 71 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది చివరి నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ.. కొన్ని నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటం వల్ల వచ్చే ఏడాది మార్చి నాటికి మొత్తం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే సికింద్రాబాద్ స్టేషన్ ఆధునిక రవాణా కేంద్రంగా కొత్త రూపును సంతరించుకోనుంది.సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మీదుగా ప్రతిరోజూ సుమారు 180 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం లక్షన్నర మందికిపైగా ప్రయాణికులు ఈ స్టేషన్‌ను వినియోగిస్తున్నారు. నగర జనాభా, రైళ్ల సంఖ్య, ప్రయాణికుల రద్దీ భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని భారీ స్థాయిలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా స్టేషన్‌కు ఉత్తరం, దక్షిణం వైపున ఆకర్షణీయమైన ఐకానిక్ భవనాలను నిర్మిస్తున్నారు. రెండు అంతస్తుల భారీ ఎయిర్ కాన్‌కోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులు ప్లాట్‌ఫారాలపై వర్షం, ఎండ ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించేందుకు పూర్తిస్థాయి రూఫింగ్ నిర్మిస్తున్నారు.ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేసేందుకు ఒకటి, పది నంబర్ ప్లాట్‌ఫారాల వద్ద ట్రావలేటర్లతో కూడిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను నిర్మిస్తున్నారు. వీటితో పాటు ఉత్తరం వైపు మల్టీలెవల్ కార్ పార్కింగ్ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. మెట్రో రైల్వే స్టేషన్‌కు నేరుగా అనుసంధానం కల్పించేలా స్కైవాక్ నిర్మాణం చేపడుతున్నారు. దీనివల్ల రైలు దిగిన ప్రయాణికులు బయటకు వచ్చి రహదారులు దాటాల్సిన అవసరం లేకుండా మెట్రోకు చేరుకునే అవకాశం ఉంటుంది. ప్లాట్‌ఫారాలపై ఆధునిక ఫ్లోరింగ్, మెరుగైన ప్రయాణికుల సౌకర్యాలు కూడా ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయి.ఇప్పటివరకు 71 శాతం పనులు పూర్తికాగా.. మిగిలిన 29 శాతం పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం ఉత్తర, దక్షిణ ప్రధాన స్టేషన్ భవనాలు, ఉత్తరం వైపు మల్టీలెవల్ కార్ పార్కింగ్, బేస్‌మెంట్, ఎయిర్ కాన్‌కోర్స్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

భాగ్యనగర్ లో నీటి కష్టాలు

హైదరాబాద్, నవంబర్ 6, (న్యూస్ పల్స్)హైదరాబాద్‌లో నీటి సరఫరా సమస్య పలు రంగాలను ప్రభావితం చేస్తోంది. ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానుల బంద్ కారణంగా నగరంలోని హాస్టళ్లకు నీరు అందక విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోతే హాస్టళ్లను మూసివేస్తామని యజమానులు హెచ్చరిస్తున్నారు. నీటి కొరతతో కొన్ని విద్యాసంస్థలు విద్యార్థులను ఇళ్లకు పంపిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు అక్రమ బోర్లపై హైడ్రా చర్యలు, స్థానికుల ఫిర్యాదులు కొనసాగుతున్నాయి. అపార్ట్‌మెంట్లలోనూ నీటి సరఫరాను కొన్ని గంటల పాటు నిలిపివేస్తున్నట్లు నోటీసులు వెలువడుతున్నాయి. నీటి వనరులను కాపాడుతూనే ప్రజలకు ప్రత్యామ్నాయ సరఫరా కల్పించాలనే డిమాండ్ పెరుగుతోంది.హైదరాబాద్‌లో నీటి కొరత రోజురోజుకూ తీవ్ర రూపం దాల్చుతోంది. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గుతున్నాయన్న ఆందోళన వ్యక్తం అవుతుండగానే.. మరోవైపు ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానుల బంద్‌తో నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ పరిణామం హాస్టళ్లు, అపార్ట్‌మెంట్లు, విద్యాసంస్థలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. నీరు అందుబాటులో లేక విద్యార్థులు, ఉద్యోగులు, నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమీర్‌పేట్‌లోని ప్రైవేట్ హాస్టళ్లకు వాటర్ ట్యాంకర్ల సరఫరా నిలిచిపోవడంతో యజమానులు ఆందోళనకు దిగారు. ఎస్ఆర్ నగర్‌లోని వాటర్ వర్క్స్ కార్యాలయానికి వెళ్లిన అమీర్‌పేట్ వెల్ఫేర్ హాస్టల్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు, ఇతర సభ్యులు జనరల్ మేనేజర్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. గత 2 రోజులుగా నీరు అందక హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ప్రైవేట్ ట్యాంకర్ల సరఫరా నిలిపివేయడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని హాస్టల్ యజమానులు పేర్కొన్నారు. అధికారులను సంప్రదించినా హైడ్రా ఆదేశాల నేపథ్యంలో తామేమీ చేయలేమని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే గురువారం నుంచి హాస్టళ్లను మూసివేయాల్సి వస్తుందని తీవ్ర హెచ్చరికలు చేశారు. అవసరమైతే నగరవ్యాప్తంగా ఆందోళన చేపడతామని స్పష్టం చేశారునీటి కొరత ప్రభావం కార్పొరేట్ విద్యాసంస్థలపైనా పడుతోంది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాస్టళ్లలో ఉంటూ చదువుకునే కాలేజీలకు రోజూ భారీగా నీరు అవసరం అవుతుంది. తాగునీటితో పాటు స్నానాలు, వంట, ఇతర అవసరాలకు సరిపడా నీరు అందకపోవడంతో హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారుతోంది. ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకునే ప్రయత్నాలు చేసినా అవసరాలకు తగినంత సరఫరా లభించడం లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కొన్ని విద్యాసంస్థలు విద్యార్థులను తాత్కాలికంగా ఇళ్లకు పంపించే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.తల్లిదండ్రులకు సమాచారం అందించి వారి పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లాలని సూచిస్తున్నాయి. దీంతో విద్యార్థులతో కళకళలాడే కొన్ని కాలేజీ క్యాంపస్‌లు, హాస్టళ్లు ఖాళీ అవుతున్నాయి. నీటి సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందో, విద్యాసంస్థలు తిరిగి ఎప్పుడు ప్రారంభమవుతాయోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.మరోవైపు.. ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానులు చేపట్టిన బంద్ నగరంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. రెవెన్యూ, హైడ్రా అధికారులు తమ బోర్లపై చర్యలు తీసుకుంటున్నారని.. ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా బోర్లు తొలగించడం వల్ల ఉపాధి కోల్పోతున్నామని ట్యాంకర్ల యజమానులు ఆరోపణలు చేస్తున్నారు. బంద్‌లో భాగంగా రోడ్లపైకి వచ్చిన కొన్ని ట్యాంకర్లను అడ్డుకోవడంతో పాటు.. ట్యాంకర్లలోని నీటిని రోడ్లపైనే పారబోసి నిరసన తెలపడంతో.. నీటి కొరత వేళ.. ట్యాంకర్ నీళ్లను వృథా చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఏపీలో పెండింగ్ మున్సిపల్ ఎన్నికలపై ఫోకస్

విజయవాడ, నవంబర్ 6, ఆంధ్రప్రదేశ్‌లో పెండింగ్‌లో ఉన్న మిగిలిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఎన్నికల నిర్వహణకు ాఇఅ సిద్ధమవుతోంది. ఇప్పటికే మేయర్, ఛైర్‌పర్సన్, డిజవిన్లు, వార్డులకు సంబంధించి రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఈ నెల10 నుంచి 12 మధ్య ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఈ నెల 25లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఏపీ హైకోర్టులో కొన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సంబంధించి కేసులు పెండింగ్ ఉన్నాయి. అందుకే అక్టోబర్ 14న జారీ చేసిన ఎన్నికల నోటిఫికేషన్‌లో ప్రస్తావన లేదు.ఏపీ హైకోర్టులో కేసులు పరిష్కారం కావడంతో ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే డివిజన్లు/ వార్డుల పునర్విభజన, ఓటర్ల జాబితాల తయారీ పూర్తి చేశారు. అలాగే మిగిలిన ప్రక్రియను కూడా పూర్తి చేశారు. ఇటీవల రిజర్వేషన్లు కూడా ఖరారు చేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం సమాచారం అందించింది. కార్పొరేషన్లలో మేయర్ పదవులకు సంబంధించి.. శ్రీకాకుళం (జనరల్ మహిళ), రాజమహేంద్రవరం (ఎస్సీ జనరల్), కాకినాడ(బీసీ మహిళ),మంగళగిరి-తాడేపల్లి (ఎస్టీ జనరల్)కి రిజర్వ్ అయ్యాయి.ఈ నాలుగు కార్పొరేషన్లకు సంబంధించి 260 డివిజన్లలో 90 స్థానాలు బీసీలకు రిజర్వ్ చేశారు. ఎస్సీలకు 35, ఎస్టీలకు 5, మహిళలకు 68, అన్ రిజర్వ్‌డ్ కింద 62 ఉన్నాయి. ఆముదాలవలస, రాజాం, భీమవరం, తాడేపల్లిగూడెం, చింతలపూడి, పాలకొల్లు, తణుకు, బి.కొత్తపేట, గుడివాడ, నరసరావుపేట, పొన్నూరు, తాడిగడప, బాపట్ల,పొదిలి, కందుకూరు, అల్లూరు, గూడూరు, కావలి, శ్రీకాళహస్తి మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఛైర్‌పర్సన్ స్థానాలకు ఎన్నికల నిర్వహించనున్నారు. వీటిలోని 749 వార్డులకూ రిజర్వేషన్లు ఖరారయ్యాయి. వార్డుల్లో బీసీలకు 231, జనరల్ మహిళకు 202, ఎస్సీలకు 106,ఎస్టీలకు 36, రిజర్వ్ అయ్యాయి. మిగిలిన వార్డులు 174 వార్డులు అన్ రిజర్వ్‌డ్ అయ్యాయి. మొత్తం మీద స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ డిసెంబర్ మొదటి వారంలో పూర్తికానున్నాయి. అయితే మధ్యలో సుప్రీం కోర్టు తీర్పు, తుఫాన్ కారణంగా కొంత ఇబ్బందులు ఎదురైనా సరే ప్రక్రియ సాఫీగానే సాగిపోయింది.

తండ్రి బాటలో వంగవీటి రాధా.....



విజయవాడ, నవంబర్ 6, విజయవాడ రాజకీయాల్లో వంగవీటి కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఒకప్పుడు కార్పొరేటర్‌గా మొదలైన ఆ కుటుంబ రాజకీయ ప్రస్థానం.. ఎమ్మెల్యే పదవి మీదుగా ఇప్పుడు నగర మేయర్ పీఠం వరకు చేరింది. తండ్రి వంగవీటి మోహన రంగా రాజకీయాల్లో సంపాదించుకున్న గుర్తింపును కొనసాగిస్తూ ఆయన కుమారుడు వంగవీటి రాధాకృష్ణ మరో కీలక విజయాన్ని అందుకున్నారు. 25 ఏళ్ల వయసులోనే ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన.. ఇప్పుడు 47 ఏళ్లకు విజయవాడ మేయర్ ఎన్నికల్లో విజయం సాధించారు. జనసేన అభ్యర్థిగా బరిలోకి దిగిన రాధా.. వైసీపీ అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మిపై 1,30,912 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కాంగ్రెస్, వామపక్షాల మద్దతుతో పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థి ఏబీ వెంకటేశ్వరరావుకు 12,642 ఓట్లు వచ్చాయి.వంగవీటి రాధాకృష్ణ రాజకీయాల్లోకి రావడానికి ముందే ఆయన కుటుంబానికి విజయవాడలో బలమైన రాజకీయ పునాది ఉంది. తండ్రి మోహన రంగా 1985లో విజయవాడ తూర్పు నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన హత్య అనంతరం రాజకీయాల్లోకి వచ్చిన తల్లి రత్నకుమారి కూడా అదే నియోజకవర్గం నుంచి 1989, 1994 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించారు.అయితే 1999 ఎన్నికల నాటికి రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. టీడీపీలో చేరిన రత్నకుమారికి ఆ ఎన్నికల్లో టికెట్ దక్కలేదు. ఆమె స్థానంలో బరిలోకి దిగిన సినీ నటుడు కోట శ్రీనివాసరావు విజయం సాధించారు. ఈ పరిణామాల తర్వాత వంగవీటి కుటుంబ రాజకీయ వారసత్వాన్ని కొనసాగించేందుకు రాధాకృష్ణ సిద్ధమయ్యారు.2003 చివర్లో రాధాకృష్ణ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. డిసెంబర్ 26న మోహన రంగా వర్ధంతి సందర్భంగా విజయవాడలో నిర్వహించిన సభలో అప్పటి పీసీసీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్, కాంగ్రెస్ నేత దానరి నారాయణరావు సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.మరుసటి ఏడాదే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయవాడ తూర్పు నుంచి పోటీ చేసి గెలిచారు. అప్పటికి ఆయన వయసు కేవలం 25 ఏళ్లు. చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టడం రాధాకృష్ణ రాజకీయ జీవితంలో తొలి పెద్ద మైలురాయిగా నిలిచింది.ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత రాధాకృష్ణ రాజకీయ ప్రయాణం ఒకే పార్టీలో సాగలేదు. 2008లో చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో చేరారు. 2009 ఎన్నికల్లో విజయవాడ సెంట్రల్ నుంచి పోటీ చేసినా విజయం దక్కలేదు. తర్వాత 2012లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014 ఎన్నికల్లో విజయవాడ తూర్పు నుంచి మరోసారి అదృష్టం పరీక్షించుకున్నప్పటికీ ఓటమి ఎదురైంది. 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన ఆయన.. ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉంటూ పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా వ్యవహరించారు. 2024 ఎన్నికల సమయంలోనూ కూటమి అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు. ఈ క్రమంలో ఆయనకు ఎమ్మెల్సీ పదవి దక్కవచ్చని, మంత్రి పదవి కూడా రావచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. కానీ చివరకు ఆయన రాజకీయ ప్రయాణం మరో మలుపు తిరిగిందిటీడీపీలో సుమారు ఏడేళ్లు కొనసాగిన రాధాకృష్ణ.. విజయవాడ స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు జనసేనలో చేరారు. కూటమి తరఫున జనసేన అభ్యర్థిగా మేయర్ ఎన్నికల్లో పోటీకి దిగారు. ఈసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి వచ్చిన ఆయన భారీ మెజారిటీతో విజయం సాధించారు. దీంతో ఎమ్మెల్యేగా మొదలైన ఆయన ఎన్నికల ప్రస్థానంలో మరో కీలక ఘట్టం చేరింది.వంగవీటి కుటుంబానికి విజయవాడ నగర రాజకీయాలతో ఉన్న అనుబంధం ఈ విజయంతో మరోసారి తెరపైకి వచ్చింది. 1981లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో మోహన రంగా కృష్ణలంకలోని 40వ డివిజన్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కార్పొరేటర్‌గా గెలిచారు. అప్పటికి ఆయన ఓ హత్య కేసులో జైలులో ఉన్నప్పటికీ ఎన్నికల్లో విజయం సాధించడం అప్పట్లో ప్రత్యేకంగా నిలిచింది. కార్పొరేటర్‌గా మొదలైన మోహన రంగా రాజకీయ ప్రస్థానం తర్వాత ఎమ్మెల్యే స్థాయికి చేరింది. ఇప్పుడు అదే నగరంలో ఆయన కుమారుడు మేయర్ ఎన్నికల్లో గెలుపొందారు. తండ్రి నగర కార్పొరేటర్‌గా పనిచేసిన చోట కుమారుడు మేయర్ పీఠాన్ని దక్కించుకోవడం ఈ కథనంలో మరో ఆసక్తికరమైన అంశం.1979లో కృష్ణా జిల్లా పెనమలూరులో జన్మించిన రాధాకృష్ణ.. గుంటూరులో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. అనంతరం తమిళనాడులోని సేలంలో వినాయక మిషన్స్ మెడికల్ కాలేజీలో మెడిసిన్ చదివేందుకు చేరారు. అయితే వైద్య విద్యను మధ్యలోనే వదిలేసి రాజకీయాల వైపు అడుగులు వేశారు. అలా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రయాణం ఇప్పుడు విజయవాడ మేయర్ ఎన్నికల్లో విజయంతో మరో మైలురాయిని చేరుకుంది.

వైసీపీ అంతర్గత పోరే ముంచిందా...



నెల్లూరు, నవంబర్ 6,రాజకీయాల్లో నెల్లూరు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ముఖ్యంగా రాజకీయంగా బలమైన నాయకులు, రెడ్డి సామాజిక వర్గం ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతంగా నెల్లూరుకు పేరుంది. ఒకప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా కనిపించిన ఈ ప్రాంతంలో ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారినట్లు ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా జరిగిన నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి సాధించిన ఘనవిజయం వైసీపీకి గట్టి హెచ్చరికగా మారింది. పార్టీకి బలమైన నాయకత్వం ఉన్నప్పటికీ ఓటర్లను ఆకట్టుకోవడంలో ఎందుకు విఫలమైందనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది.నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే కూటమి ఆధిపత్యం ఎంత బలంగా ఉందో అర్థమవుతుంది. మొత్తం 72 డివిజన్లలో టీడీపీ(41 స్థానాలను గెలుచుకుంది. బీజేపీ ఆరు, జనసేన మూడు స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఎన్నికల ప్రక్రియ పూర్తికాకముందే ఎనిమిది డివిజన్లు కూటమి ఖాతాలో ఏకగ్రీవంగా చేరడం కూడా ఆ పార్టీకి కలిసొచ్చింది. మిగిలిన స్థానాల్లోనూ కూటమి అభ్యర్థులు మెజారిటీ విజయాలను నమోదు చేయడంతో కార్పొరేషన్‌పై పట్టు సాధించారు.ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పోలుబోయిన రూప్‌కుమార్ యాదవ్ మేయర్‌గా ఘన విజయం సాధించడం మరో కీలక పరిణామం. వైసీపీ అభ్యర్థి ఆనం విజయకుమార్ రెడ్డి పై ఆయన 80,170 ఓట్ల భారీ మెజారిటీ సాధించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల వ్యక్తిగత బలం, స్థానిక సమస్యలు, పార్టీ కేడర్ పనితీరు కీలకంగా ఉంటాయి. ఈ అన్ని అంశాల్లో కూటమి వైసీపీ కంటే మెరుగైన వ్యూహంతో ముందుకు వెళ్లినట్లు ఫలితాలు సూచిస్తున్నాయి.నెల్లూరులో వైసీపీకి నాయకుల కొరత లేదు. మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్ రెడ్డి , పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ తో పాటు పలువురు సీనియర్ నాయకులు పార్టీకి అందుబాటులో ఉన్నారు. అయినప్పటికీ ఎన్నికల సమయంలో వీరంతా సమన్వయంతో పనిచేయలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాయకుల మధ్య విభేదాలు, స్థానిక స్థాయిలో ఆధిపత్య పోరు పార్టీ విజయావకాశాలను దెబ్బతీసినట్లు రాజకీయ విశ్లేషణలు సాగుతున్నాయి.మరోవైపు కూటమి అభ్యర్థుల విజయానికి వైసీపీలోని కొందరు నాయకుల సహకారం కూడా కారణమైందనే ప్రచారం తెరపైకి వచ్చింది. రూప్‌కుమార్ యాదవ్‌తో కొందరు నేతలు ముందుగానే సన్నిహితంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రచారంలో వాస్తవమెంత అనేది స్పష్టత రావాల్సి ఉంది. ఎన్నికల ఫలితాల ఆధారంగా మాత్రమే ఇలాంటి ఆరోపణలను నిర్ధారించలేం.నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాలెం , వెంకటగిరి , సూళ్లూరుపేట వంటి మున్సిపాలిటీల్లోనూ కూటమి మంచి ఫలితాలు సాధించడం వైసీపీకి మరో ఎదురుదెబ్బగా మారింది. మొత్తానికి నెల్లూరులో వైసీపీ ఓటమిని కేవలం ప్రత్యర్థుల బలంతో మాత్రమే చూడలేం. నాయకుల మధ్య సమన్వయం, పార్టీ కేడర్ చురుకుదనం, ప్రజల్లో విశ్వాసం వంటి అంశాలు కూడా ప్రభావం చూపుతాయి. ఇప్పటికైనా అంతర్గత విభేదాలను పరిష్కరించి నాయకులందరినీ ఒకే దారిలో నడిపించకపోతే ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి ఫలితాలు పునరావృతమయ్యే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

డిప్యూటీ మేయర్ బీజేపీ వర్సెస్ జనసేన

విశాఖపట్టణం, నవంబర్ 6, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విశాఖపట్నం కు ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ కావడంతో ఇక్కడి రాజకీయ పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకుంటాయి. తాజాగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అద్భుతమైన ఫలితాలు సాధించడంతో ఇప్పుడు పదవుల పంపకాలపై ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ముఖ్యంగా డిప్యూటీ మేయర్ పదవి ఎవరికి దక్కుతుందన్నది మూడు పార్టీల్లోనూ ఉత్కంఠ రేపుతోంది.విశాఖలో తెలుగుదేశం పార్టీకి మొదటి నుంచి బలమైన పట్టు ఉంది. భారతీయ జనతా పార్టీకి కూడా కొన్ని ప్రాంతాల్లో మంచి ఆదరణ ఉండగా, జనసేనకు సామాజిక సమీకరణల పరంగా ఓటు బ్యాంకు ఉంది. ఈ మూడు పార్టీల బలాలు కలవడంతో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించింది. మొత్తం 120 వార్డులకు గాను 98 స్థానాలను అధికారిక కూటమి అభ్యర్థులు గెలుచుకున్నారు. మరో ఎనిమిది మంది స్వతంత్ర అభ్యర్థులుగా విజయం సాధించినప్పటికీ, వారు కూటమికి చెందిన రెబల్స్ కావడం గమనార్హం. దీంతో కూటమి వైపు మొత్తం 106 మంది కార్పొరేటర్ల మద్దతు ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వైసీపీ 13 స్థానాలతో ప్రతిపక్షంలో ఉండనుండగా, సీపీఎం ఒక స్థానాన్ని గెలుచుకుంది.మేయర్ పదవి టీడీపీకి దక్కే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ఇప్పుడు డిప్యూటీ మేయర్ స్థానంపై బీజేపీ, జనసేన మధ్య పోటీ నెలకొంది. విశాఖలో తమకున్న రాజకీయ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని మేయర్ పదవిని ఇవ్వాలని బీజేపీ గతంలోనే కోరినట్లు తెలుస్తోంది. 2024 ఎన్నికల్లో ఎంపీ స్థానం కూడా కేటాయించకపోవడంతో కనీసం డిప్యూటీ మేయర్ పదవైనా ఇవ్వాలని టీడీపీ పెద్దల వద్ద ప్రస్తావించినట్లు ప్రచారం జరుగుతోంది.ఈ నేపథ్యంలోనే విశాఖ బీజేపీ అధ్యక్షుడు పరశురాం రాజు కార్పొరేటర్‌గా పోటీ చేశారని, ఆయనకు డిప్యూటీ మేయర్ అవకాశం కల్పిస్తామని అప్పట్లో హామీ ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ప్రస్తుతం ఆయన పేరు ఈ పదవికి ప్రముఖంగా వినిపిస్తోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కూడా ఈ పదవి తమ పార్టీకి దక్కేలా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.మరోవైపు జనసేన కూడా డిప్యూటీ మేయర్ పదవిపై ఆశలు పెట్టుకుంది. విశాఖలో 26 మంది కార్పొరేటర్లతో కూటమిలో రెండో అతిపెద్ద పార్టీగా ఉన్న తమకు ఈ అవకాశం ఇవ్వడం సమంజసమని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. కేవలం ఎనిమిది మంది కార్పొరేటర్లు ఉన్న బీజేపీకి కాకుండా, తమకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. అయితే గతంలో ఇచ్చిన రాజకీయ హామీలను పరిగణనలోకి తీసుకుంటే తమకే అవకాశం వస్తుందని బీజేపీ నేతలు ధీమాగా ఉన్నారు. ఉత్తరాంధ్ర రాజకీయ సమీకరణాలు కూడా ఈ పదవుల పంపకంలో కీలకంగా మారే అవకాశం ఉంది. విశాఖపట్నం, విజయనగరం కార్పొరేషన్లలో టీడీపీకి ప్రాధాన్యత దక్కగా, రాబోయే శ్రీకాకుళం కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేనకు అవకాశం కల్పించే ఆలోచన ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అవసరమైతే విజయనగరంలో డిప్యూటీ మేయర్ పదవిని జనసేనకు కేటాయించే ప్రతిపాదన కూడా ఉన్నట్లు తెలుస్తోంది.గతంలో విశాఖ మేయర్ పదవిని బీజేపీ గెలుచుకున్న చరిత్ర కూడా ఆ పార్టీ నేతలకు గుర్తుంది. ఇప్పుడు డిప్యూటీ మేయర్ స్థానం దక్కితే నగర రాజకీయాల్లో తమ ప్రాబల్యాన్ని పెంచుకోవచ్చని భావిస్తున్నారు. అయితే జనసేన కూడా తన బలాన్ని తక్కువగా అంచనా వేయకూడదని పట్టుబడుతోంది. దీంతో చివరకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బీజేపీ పెద్దలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. విశాఖ డిప్యూటీ మేయర్ పీఠం బీజేపీకి దక్కుతుందా? లేక జనసేన తన బలంతో ఆ స్థానాన్ని సాధించుకుంటుందా? అన్నది త్వరలో తేలనుంది.ముక్కా శ్రావణి. తమ కుటుంబం ముప్పై ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో ఉందని.. అందుకే తమకు ఈ అవకాశం దక్కిందన్నారు. కూటమి పార్టీల్లో అనుభవం ఉన్న నేతల సహకారంతో విశాఖపట్నాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళతానన్నారు.ముక్కా శ్రావణి తండ్రి ముత్యాలనాయుడు తెలుగుదేశం పార్టీలో సీనియర్ నేతగా ఉన్నారు.. ఆయన గతంలో కార్పొరేటర్‌గా పనిచేశారు. శ్రీవాణి వృత్తిరీత్యా ఫిజియో థెరపిస్ట్ కాగా.. ఆమె రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. 2015 నుంచి టీడీపీలో యాక్టివ్ అయ్యారు.. 2021 ఎన్నికల్లో 26వ వార్డు (అక్కయ్యపాలెం ప్రాంతం) నుంచి కార్పొరేటర్‌గా పోటీచేసి గెలుపొందారు. అలాగే ముక్కా శ్రావణి తన డివిజన్‌లో పనులకు సంబంధించి నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యింది. ఇటీవల ఆమెకు టికెట్ ప్రకటించిన తర్వాత ఆ వీడియో సోషల్ మీడియాలో మళ్లీ చక్కర్లు కొట్టింది. వైరల్ అయిన వీడియోలో ఏదో ఒకరోజు తమకు టైం వస్తుందన్నారు.. చెప్పినట్లుగానే ఆమె విశాఖ నగరానికి మేయర్ అయ్యారు.అంతేకాదు కూటమి పార్టీల మధ్య పొత్తు, సీట్ల సర్దుబాటుతో కొంత గందరగోళం ఏర్పడింది. మొత్తం 120 వార్డుల్లో 246మంది స్వతంత్రులు పోటీచే చేశారు. కూటమి పార్టీల్లో కూడా రెబల్స్ పోటీచేసి గెలిచారు. విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం 36వ వార్డులో కొల్లి సింహాచలం (జనసేన పార్టీ రెబల్), . అగనంపూడి జోన్ 106 వార్డులో రామునాయుడు (జనసేన పార్టీ రెబల్) గెలుపొందారు. విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం 73వ వార్డులో పెతకంశెట్టి శ్యాం సుధాకర్‌రావు (జనసేన పార్టీ రెబల్). 39, 41 వార్డుల్లో (టీడీపీ రెబల్స్) బత్తిన నవీన్, పంపాన రాజ్యలక్ష్మిలు విజయం సాధించారు. 118 వార్డులో (పెందుర్తి) టీడీపీ రెబల్ గంట్ల లక్ష్మి గెలిచారు.గాజువాక 86 వార్డులో కాకి గోవిందరెడ్డి (టీడీపీ రెబల్) బరిలో విజయాన్ని అందుకున్నారు. విశాఖపట్నం జీవీఎంసీ ఎన్నికల ప్రక్రియ పూర్తికాగా.. ఇప్పుడు అందరి దృష్టి డిప్యూటీ మేయర్ పదవివైపు మళ్లింది. ఈ పదవి కూటమిలో ఏ పార్టీకి దక్కుతుందనే చర్చ జరుగుతోంది. డిప్యూటీ మేయర్ రేసులో ప్రధానంగా విశాఖపట్నం జిల్లా బీజేపీ అధ్యక్షుడు పరుశరామరాజు పేరు వినిపిస్తుంగా.. ఆయన 54వ డివిజన్ నుంచి గెలిచారు. కూటమి పొత్తులో భాగంగా ఆయనకు పదవి ఖాయమనే ప్రచారం జరుగుతోంది. ఒకవేళ జనసేన పార్టీకి కనుక పదవి ఇస్తే.. రేసులో విశాఖపట్నం దక్షిణం నియోజకవర్గం పరిధిలోని 40 డివిజన్ నుంచి గెలిచిన భీశెట్టి వసంత లక్ష్మికి అవకాశం ఉందంటున్నారు. అయితే డిప్యూటీ మేయర్ పదవిపై ఒకటి, రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని చెబుతున్నారు.

తిరుమలలో ఈ నెల 16 నుంచి..: ఎంట్రీ ఫీజు రూ. 50 గా నిర్ధారించిన టీటీడీ

తిరుమల క్షేత్ర మహత్యాన్ని, శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్య చరిత్రను భక్తులకు కళ్లకు కట్టినట్లు వివరించడానికి తిరుమల తిరుపతి దేవస్థానం నూతనంగా ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం ట్రయల్ రన్ కొనసాగుతోంది. అత్యాధునిక డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఈ మ్యూజియం ట్రయల్ రన్ ను టీటీడీ పొడిగించింది. ఈ నెల 15వ తేదీ వరకు ఈ ట్రయల్ రన్ కొనసాగనుంది. ప్రపంచ నలుమూలల నుంచి వచ్చే శ్రీవారి భక్తులకు వూర్తిస్థాయిలో దీనిని ప్రారంభించడానికి ముందుగా ఈ ట్రయల్ రన్ చేపట్టింది టీటీడీ. ఈ సమయంలో ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మ్యూజియం సందర్శనకు అనుమతి ఇస్తారు. టీటీడీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, తిరుమల, తిరుపతికి చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక మీడియా ప్రతినిధులు, వారి కుటుంబాలు ఈ మ్యూజియాన్ని సందర్శించవచ్చు. అలాగే.. శ్రీవారి సేవకులు, టీటీడీ ఆధ్వర్యంలో నడిచే విద్యాసంస్థలతో పాటు ఇతర పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీటీడీ అధికారులు విజ్ఞప్తి చేశారు. ట్రయల్ రన్ పూర్తయిన అనంతరం 16వ తేదీ నుండి భక్తులను మ్యూజియం సందర్శనకు అనుమతిస్తారు. ఈ మ్యూజియం ఎంట్రీ ఫీజు 50 రూపాయలుగా నిర్ధారించారు.



వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అరెస్టు

గుంటూరు,వైకాపా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ని పోలీసులు అరెస్టు చేసారు. చ పోలింగ్ అయిన తరువాత బ్యాలెట్ బాక్సు రోడ్డు మీద దించి పక్కకు ఎందుకు తీసుకెళ్తున్నారు అని ప్రశ్నించినందుకు లేళ్ల అప్పిరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేసారు. వెంగళాయపాలెంలో ఎన్నిక పూర్తయిన తర్వాత స్ట్రాంగ్ రూమ్ తీసుకువెళ్తూ నల్లపాడు సెంటర్లో బ్యాలెట్ బాక్స్ దించి అధికారి పక్కకి తీసుకువెళ్లడాన్ని వైకాపా శ్రేణులు ప్రశ్నించారు. బ్యాలెట్ బాక్స్ ను మార్చేయడానికి టిడిపి వాళ్ళ దగ్గర కు తీసుకెళ్తున్నాడంటు నిలదీసారు. బ్యాలెట్ బాక్స్ బయటికి రావడానికి నిరసిస్తూ నల్లపాడులో రెండు గంటల పాటు వైసీపీ నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. ఎమ్మెల్యే ఆ సమాచారం తెలుసుకుని నల్లపాడు వెళ్లారు. బ్యాలెట్ బాక్స్ తో ధర్నా చేస్తున్న నాయకులకు సంఘీభావంగా ధర్నాలో పాల్గొన్నారు. ధర్నా చేస్తున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు లాఠీ ఛార్జ్ చేసారు. తరువాత పోలీసులు బ్యాలెట్ బాక్స్ ను తీసుకువెళ్లిపోయారు. ఎన్నికల సిబ్బందిని అడ్డుకుని బ్యాలెట్ బాక్స్ లో తమ ఆధీనంలోకి తీసుకున్నారని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పై కేసు నమోదు చేసారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో అప్పిరెడ్డిని నగరంపాలెం పోలీస్ స్టేషన్ నుంచి నల్లపాడు పోలీస్ స్టేషన్ తరలించారు. అప్పిరెడ్డి పై నాన్ బెయిల్ సెక్షన్లతో కేసులు నమోదు చేసారు.

రాగి లేదా స్టీల్ బాటిల్.. ఎందులో నీళ్లు తాగితే ఆరోగ్యానికి మంచిది..?



ఉదయం నిద్ర లేచిన దగ్గర్నుంచి రాత్రి పడుకునే వరకు మనం అధికంగా తీసుకునేది నీళ్లు. గంటకోసారి ఎన్నో కొన్ని నీళ్లు తాగుతూనే ఉంటాం. నీళ్లు తాగడం వల్ల చాలా రకాల సమస్యలు నుంచి బయటపడవచ్చు. నీళ్లు అధికంగా తాగడం వల్ల మెదడు పనితీరు మెరుగవటమే కాక ఉత్సాహం పెరుగుతుంది. ఇక ప్రస్తుతం వర్షాకాలం నడుస్తోంది. వర్షాకాలంలో నీరు ఎక్కువగా కలుషితమయ్యే అవకాశం ఉంది. మురికి నీరు తాగునీటి వనరులలోకి ప్రవేశించడం ద్వారా అనారోగ్యాల ముప్పు పెరుగుతుంది. అందుకే సురక్షితమైన, శుద్ధి చేసిన నీటిని మాత్రమే తాగడం చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. అయితే మనం నీరు తాగే బాటిల్ కూడా ముఖ్యమేనని వైద్యులు చెబుతున్నారు. ప్లాస్టిక్ బాటిళ్లలో తాగితే అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని వివరిస్తున్నారు. ఈ క్రమంలో ఈ మధ్య కాలంలో రాగి, స్టీల్ బాటిళ్లను ఎక్కువగా వాడుతున్నారు. మరి ఈ రెండిట్లో ఏ బాటిల్ బెస్ట్? అని చూస్తే.. రాగి బాటిల్?లో సుమారు 6-8 గంటల పాటు నీటిని ఉంచడం వల్ల అందులోని పోషక గుణాలు వాటర్?లో కలిసిపోతాయని వైద్యులు అంటున్నారు. అలాగే రాగిలో అనేక యాంటీ మైక్రోబయల్ గుణాలు ఉంటాయని అవి శరీరానికి ఎంతో మంచిదని చెబుతున్నారు. ఇది బాడీలోని బ్యాక్టీరియాను చంపి రోగ నిరోధక శక్తిని పెంచుతుందని చెబుతున్నారు. లెస్ స్టీల్ బాటిల్స్ కూడా?ఆరోగ్యానికి సురక్షితమని వైద్యులు వివరిస్తున్నారు. ప్లాస్టిక్ బాటిళ్ల కంటే స్టీల్ బాటిల్ ఉత్తమం అని చెబుతున్నారు. ఇంకా తుప్పు పట్టకుండా చాలా రోజుల పాటు మన్నికగా ఉంటుందని అంటున్నారు. అలాగే స్టీల్ బాటిల్స్ చల్లటి, వేడి నీటిని వాటి ఉష్ణోగ్రతలు తగ్గకుండా చాలా సమయం ఉంచుతుందంటున్నారు.

జస్ట్.. ఓ అల్లం ముక్కను వాడి చూడండి చాలు



ఈ వర్షాకాలంలో ఇమ్యూనిటీని పెంచడానికి అల్లం అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. వర్షాకాలంలో తరచుగా వచ్చే ఇన్ఫెక్షన్ల నుంచి శరీరాన్ని రక్షించడానికి అల్లం చాలా సహాయపడుతుంది. వర్షాకాలంలో జీర్ణక్రియ మందగించి, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు వస్తూ ఉంటాయి. అల్లం జీర్ణ ఎంజైమ్‌లను ఉత్తేజపరచి, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. దీంతో అజీర్తి, గ్యాస్, వికారం వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. చలికాలంలో వచ్చే జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటి వాటికి అల్లం ఒక అద్భుతమైన ఔషధం. దీనిలోని యాంటీమైక్రోబియల్ లక్షణాలు శ్వాసకోశ ఇన్ఫెక్షన్లను తగ్గించి, గొంతు మంటను తగ్గిస్తాయి. తేమతో కూడిన వాతావరణం కీళ్ల నొప్పులు, ఆర్థరైటిస్ లక్షణాలను తీవ్రతరం చేయవచ్చు. అల్లంలోని యాంటీ-ఇన్ఫ్లమేటరీ గుణాలు కీళ్ల నొప్పులు, వాపులను తగ్గించి, ముఖ్యంగా తేమ వాతావరణంలో సహజ ఉపశమనాన్ని అందిస్తాయి. అల్లం రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది, రక్తం గడ్డకట్టడాన్ని నిరోధిస్తుంది. వర్షాకాలంలో శారీరక శ్రమ తగ్గడం వల్ల రక్త ప్రసరణ మందగిస్తుంది. ఈ సమయంలో అల్లం శరీరాన్ని వెచ్చగా, శక్తివంతంగా ఉంచడంలో సహాయపడుతుంది.' వర్షాకాలంలో జీవక్రియ మందగించి, శరీరంలో విష పదార్థాలు పేరుకుపోతాయి. అల్లం సహజ డిటాక్సిఫైయర్‌గా పనిచేసి, హానికరమైన పదార్థాలను బయటకు పంపుతుంది. అలాగే కాలేయ పనితీరుకు కూడా మద్దతు ఇస్తుంది. ంటలవతీబితిబవఎవనిబి చల్లని వర్షాకాలంలో శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడానికి అల్లం చాలా మంచిది. ఇది శరీరాన్ని వెచ్చగా ఉంచి, ఆకస్మిక ఉష్ణోగ్రత మార్పుల నుండి రక్షిస్తుంది. తేమతో కూడిన వర్షాకాల వాతావరణం బ్యాక్టీరియా వృద్ధికి అనుకూలం. అల్లంలోని శక్తివంతమైన యాంటీబాక్టీరియల్ లక్షణాలు ఆహారం, నీటి ద్వారా వచ్చే వ్యాధుల నుండి శరీరాన్ని రక్షించడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి.

ప్రతిరోజూ ఈ లడ్డూ గానీ తింటున్నారా- తయారీ విధానం ఈజీ



శరీరానికి ప్రోటీన్ చాలా అవసరం. ఇది ఎనర్జీని అందించడమే కాకుండా, కండరాల పెరుగుదలకు సహాయపడుతుంది. కొందరు ఖరీదైన ప్రోటీన్ పౌడర్లను వాడి కండరాలను బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తుంటారు. ఇంట్లోనే ప్రోటీన్ లడ్డూలను తయారుచేసుకుని తినడం వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవు. పైగా ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు కూడా. ఈ లడ్డూలలో ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి బరువును నియంత్రించడంలో సహాయపడతాయి, జీర్ణవ్యవస్థను బలోపేతం చేస్తాయి. రోజువారీ పనుల్లో బిజీగా ఉంటూ, సరైన సమయానికి ఆహారాన్ని తీసుకోకపోవడం వల్ల శరీరం త్వరగా అలసిపోతుంది. కావాల్సినంత ప్రోటీన్లు అందవు. దీని దుష్ప్రభావం ఇప్పటికిప్పుడు కనిపించకపోయినా..దీర్ఘకాలంలో దెబ్బతింటుంది. ఏ చిన్న పని చేసిన శరీరం త్వరగా అలసిపోవాల్సిన దశకు చేరుకుంటుంది. ఆ పరిస్థితి రాకుండా ముందుగానే నివారించుకోవడం మన చేతుల్లోనే ఉంది. ఇంట్లోనే లడ్డూల రూపంలో ప్రోటీన్లను తీసుకోవచ్చు. ఈ లడ్డూలు ప్రోటీన్, ఫైబర్, విటమిన్లతో నిండి ఉంటాయి. ఇది బరువును నియంత్రించడంలో సహాయపడుతుంది. జీర్ణవ్యవస్థను బలోపేతం చేస్తుంది. ఈ లడ్డూలు తయారుచేయడానికి కావలసిన పదార్థాలు.. ఒక కప్పు వేయించిన వేరుశెనగలు అర కప్పు వేయించిన పప్పులు (శనగలు) అర కప్పు బాదం పావు కప్పు గుమ్మడి గింజల' పావు కప్పు గింజలు లేని ఖర్జూరాలు రెండు చెంచాల కరిగించిన బెల్లం ఒక చెంచా నెయ్యి పావు చెంచా యాలకుల పొడి. తయారీ విధానం.. ముందుగా వేరుశెనగ, శనగలు, బాదం, గుమ్మడి గింజలను వేయించుకోవాలి. అవి చల్లబడిన తర్వాత, మిక్సర్‌లో వేసి మెత్తగా పొడి చేయాలి. తర్వాత, ఖర్జూరాలను 10 నిమిషాల పాటు వేడి నీటిలో నానబెట్టి, మిక్సర్‌లో వేసి మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి ఒక గిన్నెలో పొడి చేసిన మిశ్రమం, ఖర్జూరం పేస్ట్, కరిగించిన బెల్లం, యాలకుల పొడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమానికి కొద్దిగా నెయ్యి జోడించి చిన్న లడ్డూలను తయారు చేసుకోవాలి. ప్రతిరోజూ ఉదయం అల్పాహారం తర్వాత లేదా సాయంత్రం ఒక లడ్డూ తినాలి. దీనిని పాలతో కూడా తీసుకోవచ్చు. ఈ లడ్డూలు పిల్లలకు, పెద్దలకు కూడా ప్రయోజనకరమైనవి. బలహీనమైన శరీరాన్ని తిరిగి శక్తివంతం చేయడానికి ఇవి సహాయపడతాయి. మధుమేహం ఉన్నవారు బెల్లం పరిమాణాన్ని తగ్గించుకోవచ్చు. వేరుశెనగకు బదులుగా బాదం అయినా ఉపయోగించవచ్చు.

ఖర్జూరంతో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు – వీరికి మాత్రం..!!




ఖర్జూరం. అందరూ ఎక్కువగా ఇష్టపడతారు. ఖర్జూరాలను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. కొందరికి ఖర్జూరాలను నేరుగా తింటే సరిగ్గా జీర్ణం కావు. అలాంటి వారు ఖర్జూరాలను నానబెట్టి తింటే ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఖర్జూరాలను నేరుగా తినడం కంటే నానబెట్టి తింటే ఎక్కువ లాభం ఉంటుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఖర్జూరాలను 3 లేదా 4 తీసుకుని రాత్రి పూట నీటిలో నానబెట్టాలి. వాటిని మరుసటి రోజు ఉదయం పరగడుపునే తినాలి. ఇలా రోజూ తినడం వల్ల అనేక లాభాలు ఉంటాయి. ఖర్జూరాల్లో గ్లూకోజ్, ఫ్రక్టోజ్, సుక్రోజ్ వంటి సహజసిద్ధమైన చక్కెరలు అధికంగా ఉంటాయి. కనుక ఉదయం వీటిని తింటే శరీరానికి తక్షణమే శక్తి లభిస్తుంది. రోజంతా శరీరంలో శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. నీరసం, అలసట ఉండవు. బద్దకం పోతుంది. ఖర్జూరాలను తినడం వల్ల వాటిల్లో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీని వల్ల మలబద్దకం తగ్గుతుంది. నానబెట్టిన ఖర్జూరాలు ప్రీబయోటిక్ ఆహారంగా కూడా పనిచేస్తాయి. ఖర్జూరాలలో ఐరన్ అధిక మొత్తంలో ఉంటుంది. కనుక వీటిని రోజూ తింటే శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిలు పెరుగుతాయి. రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. రక్తహీనత సమస్య ఉన్నవారికి నానబెట్టిన ఖర్జూరాలు ఎంతో మేలు చేస్తాయి. ఖర్జూరాలలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది బీపీని నియంత్రిస్తుంది. గుండె పనితీరు మెరుగు పడేలా చేస్తుంది. ఖర్జూరాలను తినడం వల్ల శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. అదే విధంగ ఖర్జూరా తీసుకోవటం వలన గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఖర్జూరాల్లో అధిక మొత్తంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మెదడు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఖర్జూరాల్లోని సహజసిద్ధమైన చక్కెరలు మెదడుకు కావల్సిన శక్తిని అందిస్తాయి. దీని వల్ల మెదడు చురుగ్గా ఉంటుంది. యాక్టివ్‌గా పనిచేస్తారు. ఆలోచనా సామర్థ్యం పెరుగుతుంది. ఖర్జూరాల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మెదడు కణాలు ఆక్సీకరణ ఒత్తిడికి గురి కాకుండా చూస్తాయి. దీని వల్ల మెదడు ఆరోగ్యంగా ఉంటుంది. ఖర్జూరాల్లో ఎముకల ఆరోగ్యానికి అవసరం అయిన క్యాల్షియం, మెగ్నిషియం, ఫాస్ఫరస్ వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. కనుక ఖర్జూరాలను రోజూ తింటే ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. నానబెట్టిన ఖర్జూరాలను తింటే లివర్, కిడ్నీలు శుభ్రంగా మారుతాయి. ఆయా అవయవాలు ఆరోగ్యంగా ఉంటాయి. ఇలా నానబెట్టిన ఖర్జూరాలను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

రోజుకు 20 కప్పుల టీ తాగుతూ.. 8 నెలల్లో 38 కేజీలు తగ్గింది.. ఎలా సాధ్యం..?



మనుషులందరూ ఒకేలా ఉండరు. కొందరు సన్నగా ఉంటే, కొందరు లావుగా ఉంటారు. ఇది శరీర స్వభావాల మీద ఆధారపడి ఉంటుంది. సన్నగా ఉండేవారికి బరువు పెరగాలనే కోరిక ఉంటుంది. లావుగా ఉండేవారికి తగ్గాలనే ఆశ ఉంటుంది. అధిక బరువు శరీరాకృతినే కాదు, ఆరోగ్యాన్నీ దెబ్బతీస్తుంది. ఇక నేటి యువత అనారోగ్యకరమైన ఆహారం, అధిక కొవ్వు, చక్కెరలు ఉన్న ప్రాసెస్ చేసిన ఆహారాలు తినడంతో పాటు.. తగినంత శారీరక శ్రమ లేకపోవడం వలన బరువు పెరుగుతున్నారు. అయితే ప్రస్తుతం ఓ వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. యూకేలోని లింకన్ షైర్ కు చెందిన సుసాన్ గార్నర్ వయసు 61 ఏళ్లు. ఆమెకు టీ తాగడం అంటే ఓ వ్యసనం. ప్రతిరోజూ 20 కప్పుల టీ తాగడం ఆమె దినచర్యలో భాగంగా ఉండేది. అలా వారానికి 140 కప్పుల టీ.. ప్రతి మూడు రోజులకు ఒక కిలోగ్రాము చక్కెర తినేది అన్నమాట. దీంతో ఆమె బరువు బరువు 95 కిలోలకు పెరిగింది. దీంతో ఆమె వైద్యుడిని సంప్రదించగా.. వైద్యులు ఆమెకు బరువు తగ్గడాన్ని ప్రోత్సహించే ఇంజెక్షన్ ద్వారా ఇవ్వబడే మౌంజారో అనే మందును సూచించారు. ఈ మౌంజారో మందు ప్రారంభ మోతాదు 2.5 ఎణ ఉంటుంది. ఆ తర్వాత 7 ఎణ కు పెరిగింది. దీంతో మొదటి వారంలోనే సుమారు 3 కిలోలు తగ్గింది. మౌంజారోతో పాటు ఔఊ మార్గదర్శకాలను పాటించింది. అంటే.. రోజుకు 10 వేల అడుగులు నడవడం, కనీసం 2 లీటర్ల నీరు తాగడం, అలాగే రోజూ 5 సార్లు పండ్లు, కూరగాయలు తీసుకోవడం చేయాలి.

వీళ్లు జామ పండ్లు తింటే చాలా డేంజర్..!



జామ పండ్లను పేద వాడి యాపిల్ అని వైద్యులు చెబుతారు. దానికి కారణం.. యాపిల్ లో ఉండే పోషకాలలో చాలా వరకు జామ పండులో కూడా ఉంటాయి. మన ఇళ్లలో జామకాయలు అధికంగా లభ్యమవుతాయి. ఇక జామ పండ్లలో విటమిన్ సీ శాతం ఎక్కువగా ఉంటుంది. అలాగే ఫైబర్?, పొటాషియం స్థాయిలూ జామ పండ్లలో అధికంగా ఉంటాయి. అలాగే బరువు తగ్గాలనుకునే వారికి జామ పండు సూపర్ ఛాయిస్ అని నిపుణులు చెబుతున్నారు. షుగర్?వ్యాధితో బాధపడేవారు తరచూ జామ పండు తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉండేలా చూసుకోవచ్చని డాక్టర్లు వివరిస్తున్నారు. అంతేకాక జామకాయలో ఉండే కావర్, ఇతర మినరల్స్?థైరాయిడ్?జీవక్రియలు క్రమబద్ధం చేయడానికి హార్మోన్ల ఉత్పత్తికి ఎంతగానో సహాయపడతాయని చెబుతున్నారు. అలాగే జామకాయలో ఉండే విటమిన్?ఏ కారణంగా కంటిచూపును మెరుగుపడుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉండడానికి జామ ఎంతో ఉపయోగపడుతుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. జామకాయలో ఉండే పీచు పదార్థం షుగర్ పేషంట్స్ కు ఎంతో మేలు చేస్తుంది. మెదడు పనితీరుని మెరుపరుస్తుంది. రక్తపోటుతో బాధపడేవారు జామకాయ తినడం వల్ల దాన్ని అదుపులో ఉండేలా చూసుకోవచ్చు.. అని వైద్యులు వివరిస్తున్నారు. " అయితే జామకాయ నాలుగు రకాల వ్యక్తులకు సమస్యాత్మకంగా పనిచేస్తుందని వైద్యులు చెబుతున్నారు. జీర్ణ సమస్యలు, ప్రకోప ప్రేగు సిండ్రోమ్ (ఎఐ) ఉన్న రోగులు ఈ పండును తీసుకోకూడదని వివరిస్తున్నారు.జామ పండు విత్తనాలు జీర్ణం కావడం కష్టం. ఇది కడుపు నొప్పి, తిమ్మిరి లేదా అజీర్ణానికి కారణమవుతుందని చెబుతున్నారు. అలాగే మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నవారు కూడా ఈ పండుకు దూరంగా ఉండాలట. అంతేకాక జలుబు, దీర్ఘకాలిక సైనస్ సమస్యలు ఉన్న వ్యక్తులు శీతాకాలంలో జామ పండును తినకూడదని వైద్యులు వివరిస్తున్నారు.

స్పోర్ట్స్ న్యూస్

ఫీల్డింగ్‌లో టీమిండియా అదుర్స్.. కోహ్లీ, రోహిత్‌పై కోచ్ ప్రశంసలు!



న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో భారత జట్టు ఫీల్డింగ్ అద్భుతంగా ఉందని ఫీల్డింగ్ కోచ్ సుభదీప్ ఘోష్ ప్రశంసించారు. విరాట్ కోహ్లీ క్యాచ్, రోహిత్ శర్మ రనౌట్ జట్టు ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని కొనియాడారు. ఆక్లాండ్‌లో వర్షం అంతరాయం కలిగించిన తొలి వన్డేలో భారత్ డీఎల్ఎస్ పద్ధతిలో ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను 185 పరుగులకే కట్టడి చేయడంలో బౌలర్లతో పాటు ఫీల్డర్లు కూడా కీలక పాత్ర పోషించారని ఘోష్ తెలిపారు. క్యాచింగ్, గ్రౌండ్ ఫీల్డింగ్, ఆటగాళ్ల చురుకుదనం బాగున్నాయని చెప్పారు.కోహ్లీకి కవర్, పాయింట్ స్థానాల్లో ఫీల్డింగ్ చేసిన అపార అనుభవం ఉండటంతో బంతి దిశను ముందుగానే అంచనా వేయగలుగుతున్నారని ఫీల్డింగ్ కోచ్ సుభదీప్ ఘోష్ వివరించారు. రనౌట్ సమయంలో రోహిత్ కూడా బంతి వెళ్లే దిశను పసిగట్టి ముందుగానే కదిలాడని ప్రశంసించారు. కోహ్లీ అద్భుతమైన క్యాచ్, రోహిత్ శర్మ కీలక రనౌట్ చేయడంపై ఆయన అభినందించారు.న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో భారత జట్టు సమష్టి ప్రదర్శనతో ఆకట్టుకుంది. బౌలర్లు, ఫీల్డర్లు సమన్వయంతో రాణించడంతో కివీస్ జట్టు 185 పరుగులకే పరిమితమైంది. ముఖ్యంగా కోహ్లీ పట్టిన అద్భుతమైన క్యాచ్, రోహిత్ శర్మ చేసిన రనౌట్ మ్యాచ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ప్రదర్శనపై సుభదీప్ ఘోష్ మాట్లాడుతూ.. ఫీల్డింగ్‌లో ముందస్తు అంచనా చాలా ముఖ్యమని తెలిపారు.కోహ్లీ ఎన్నోసార్లు కవర్స్, పాయింట్ స్థానాల్లో ఫీల్డింగ్ చేశాడని ఫీల్డింగ్ కోచ్ సుభదీప్ ఘోష్ తెలిపారు. అందువల్ల బంతి ఏ దిశగా వస్తుంది? బ్యాట్‌కు తగిలిన తర్వాత ఎలా ప్రయాణిస్తుంది? అనే విషయాలను కోహ్లీ త్వరగా అంచనా వేయగలడని చెప్పారు. ఆ అవగాహనే మైదానంలో అతడి అద్భుతమైన ప్రదర్శనకు కారణమైందని వివరించారు.ఇక రోహిత్ శర్మ రనౌట్ గురించి మాట్లాడుతూ.. బంతి స్క్వేర్ లెగ్ వైపు వెళ్తుందని ముందుగానే ఊహించి అటువైపు కదిలాడని వివరించారు. ఈ ముందస్తు అంచనా వల్లే రనౌట్‌ను విజయవంతంగా పూర్తి చేయగలిగాడన్నారు. విదేశీ పర్యటనల్లో మైదానాల పరిమాణం, వాతావరణ పరిస్థితులు మారుతుంటాయని, వాటికి అనుగుణంగా ఆటగాళ్లు తమ ఫీల్డింగ్‌ను మార్చుకోవాలని ఘోష్ సూచించారు. సరైన మైండ్‌సెట్‌తో పాటు తొలి అడుగు వేగంగా వేయడం కూడా ఫీల్డింగ్‌లో కీలకమని తెలిపారు.

నా సతీమణి క్యాన్సర్ పోరాటం.. నా జీవితాన్ని మార్చేసింది: టిక్‌నర్

'ప్రతీ మగాడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుంది'అనేది పెద్దల మాట. న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ బ్లెయిర్ టిక్‌నర్ కూడా ఇదే విషయాన్ని వెల్లడించాడు. తన సతీమణి సారా జీవితాన్నే మార్చేసిందని చెప్పుకొచ్చాడు. తన సతీమణి ఈ ఏడాది ఏప్రిల్‌లో క్యాన్సర్ బారిన పడిందని, 8 నెలల పాటు చికిత్స తీసుకొని కోలుకుందని తెలిపాడు. ఈ కఠిన సమయంలో తాను పొందిన అనుభవం జీవితంపై, తన ఆటపై ఆలోచన విధానాన్ని పూర్తిగా మార్చేసిందని చెప్పాడు.భారత్‌తో తొలి వన్డేలో టిక్‌నర్ అద్వితీయమైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఆఖరి వికెట్‌గా క్రీజులోకి వచ్చి నాలుగు సిక్స్‌లు బాదాడు. రెండో వన్డేకు ముందు మీడియాతో మాట్లాడిన టిక్‌నర్.. తన భార్య సారా తన హీరో అని చెప్పుకొచ్చాడు.'నా జీవితంలోనూ ఎన్నో కష్టాలు ఉన్నాయి. ఈ కష్ట కాలంలో నా సతీమణి సారా, నా కుటుంబం అండగా నిలిచింది. ఇప్పుడు నేను మళ్లీ నా క్రికెట్‌ను ఆస్వాదించడం ప్రారంభించాను. కెరీర్ ప్రారంభంలో నేను చాలా ఒత్తిడికి గురయ్యేవాడిని. ఆ తర్వాత నా సతీమణి క్యాన్సర్ చికిత్స సమయంలోనూ చాలా కష్టపడ్డాను. ఇప్పుడు ఆ దశను దాటి వచ్చాక, నరదాగా క్రికెట్ ఆడుతూ ఆస్వాదించాలనుకుంటున్నాను.క్రికెట్ నా జీవితంలో కీలకమైన భాగమే. కానీ అదే నా సర్వస్వం కాదనే విషయాన్ని తెలుసుకున్నాను. క్రికెట్ కంటే జీవితం పెద్దదనే విషయాన్ని



గ్రహించాను. మ్యాచ్ ముగిసిన తర్వాత నా కూతురు, నా సతీమణి కోసం ఇంటికి వెళ్లడం కంటే సంతోషం మరొకటి లేదు. అందుకే క్రికెట్‌కు కాస్త ప్రాధాన్యం తగ్గించానుగతంలో ఇంగ్లండ్‌పై కూడా నేను ఇలానే బ్యాటింగ్ చేశాను. నన్ను అప్‌ది ఆర్డర్ ప్రమోట్ చేస్తే సంతోషిస్తాను. ఇలానే ఆడుతూ.. నెమ్మదిగా మూడో స్థానానికి చేరుకోవాలనుకుంటున్నాను. వన్డేల్లో బౌలర్లకు పరిస్థితులు అనుకూలంగా ఉంటాయి.400 పరుగుల భారీ స్కోర్లు నమోదవ్వడం నాకు నచ్చదు. వెల్లింగ్టన్ పిచ్‌పై బౌన్స్‌తో పాటు పేస్ లభిస్తుందని ఆశిస్తున్నాను. న్యూజిలాండ్‌లో ప్రతీ గ్రౌండ్ భిన్నంగా ఉంటుంది. డెత్ ఓవర్లలో అందుకు తగ్గ ప్రణాళికలతో బౌలింగ్ చేస్తాను.'అని టిక్‌నర్ చెప్పుకొచ్చాడు.

గావస్కర్, కోహ్లీ సరసన జింబాబ్వే కెప్టెన్

అఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో జింబాబ్వే బ్యాటర్లు శతకాలతో చెలరేగుతున్నారు. ఇప్పటికే బ్రెండన్ టేలర్ (131) సెంచరీ చేయగా, తాజాగా కెప్టెన్ బ్రియాన్ బెన్నెట్ కూడా అజేయ శతకం(128)తో రాణించాడు. తద్వారా జింబాబ్వే 400 పరుగుల మార్క్‌ను దాటి భారీ స్కోరు దిశగా వెళ్తోంది. రెండో రోజు ఆటలో సెంచరీ బాదిన కెప్టెన్ బెన్నెట్ ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. అంతేకాక టీమిండియా మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్, స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ సరసన బెన్నెట్ నిలిచాడుటెస్టుల్లో కెప్టెన్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న తొలి మ్యాచ్‌లోనే సెంచరీ బాదిన ఆటగాళ్ల జాబితాలో బ్రియాన్ బెన్నెట్ చోటు సంపాదించాడు. ఇప్పటివరకు 35 మంది ప్లేయర్లు ఈ రికార్డు సాధించారు. కోహ్లీ, విజయ్ హజారే, గావస్కర్, గిల్ వంటి దిగ్గజాల సరసన బ్రియాన్ నిలిచాడు. ఇందులో విరాట్ కోహ్లీ, గ్రెగ్ చాపెల్ మాత్రం కెప్టెన్ బాధ్యతలు తీసుకున్న తొలి మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలు బాదిన క్రికెటర్లుగా రికార్డులకెక్కారు. అయితే జింబాబ్వే తరపున కెప్టెన్‌గా డెబ్యూ సెంచరీ బాదిన నాలుగో ప్లేయర్‌గా బ్రియాన్ బెన్నెట్ నిలిచాడు. గతంలో 1992లో డీఎల్ హూగ్‌టన్ (121 పరుగులు) , 2011లో బ్రెండన్ టేలర్ (105 నాటౌట్), 2020లో బంగ్లాదేశ్‌తో టెస్టులో క్రెయిగ్ ఎర్విన్ (107) సెంచరీలు బాదారు.



తండ్రికి తగ్గ తనయుడు..సెహ్వాగ్ కొడుకు విధ్వంసం!



అండర్-19 ఆసియాకప్‌లో భాగంగా నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ పెద్ద కుమారుడు ఆర్యవీర్ సెహ్వాగ్ విధ్వంసం సృష్టించాడు. ఆర్యవీర్ 129 పరుగుల లక్ష్య చేధనలో ఆకాశమే హద్దుగా చెలరేగడంతో భారత్ 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ కుడిచేతి వాటం బ్యాటర్ 52 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 70 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.ఆర్యవీర్ మైదానం నలుమూలల షాట్లు ఆడుతూ నేపాల్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఆర్యవీర్ సెహ్వాగ్ తన తండ్రి బ్యాటింగ్‌ను తలపిస్తూ సిక్సర్‌తో తన తొలి అండర్-19 అర్ధ శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. కేవలం 34 బంతుల్లోనే ఈ ఫీట్‌ను అందుకున్నాడు. అతడితో పాటు కెప్టెన్ లక్ష్య రాజేశ్ రాయచందాని(53) అజేయ హాఫ్ సెంచరీతో మెరిశాడు. ఫలితంగా ఈ స్వల్ప లక్ష్యాన్ని భారత్ కేవలం 19.1 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా చేధించింది. అంతకుముందు భారత బౌలర్లు చెలరేగడంతో నేపాల్ జట్టు 42.3 ఓవర్లలో 128 పరుగులకే ఆలౌటైంది.ఆర్యవీర్ విధ్వంసకర ఇన్నింగ్స్ తర్వాత క్రికెట్ అభిమానులు, సెహ్వాగ్ ఫ్యాన్స్ సోషల్ మీడియా ద్వారా అతడిపై ప్రశంసల జల్లు కురిపించారు. తండ్రికి తగ్గ తనయుడని కొందరు అంటే.. తండ్రికి మించిన తనయుడని మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. గతంలో దేశావాళీ టోర్నీ మన్కడ్ ట్రోఫీలో 143 బంతుల్లోనే 173 పరుగులు బాది కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఢిల్లీ జట్టుకు భారీ స్కోరు అందించాడు. అలానే ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో వెస్ట్ ఢిల్లీ లయన్స్ తరఫున కూడా ఆర్యవీర్ ఆడాడు. ఇలా దేశవాళీ టోర్నీల్లో ఆడిన అనుభవం ఆర్యవీర్ సెహ్వాగ్‌కు ఎంతగానో ఉపయోగపడింది.

బంగ్లాదేశ్ క్రికెటర్‌కు తీవ్ర గాయం.. స్ట్రెచర్‌పై తరలింపు!



సిల్హెట్ వేదికగా వెస్టిండీస్, బంగ్లాదేశ్ మధ్య రెండో టెస్ట్ జరుగుతోంది. ఈ మ్యాచ్‌లో బంగ్లా జట్టుకు ఊహించని షాక్ తగిలింది. మ్యాచ్ రెండో రోజు ఆటలో ఆ జట్టు స్టార్ ఓపెనర్ షాద్మాన్ ఇస్లాం తీవ్రంగా గాయపడ్డాడు. ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో అతడి ఎడమ కాలు మడమ బెణకడంతో తీవ్రమైన నొప్పితో విలవిల్లాడు. కనీసం నడవలేని పరిస్థితిలో మైదానంలో కుప్పకూలిపోయాడు. దీంతో వెంటనే స్పందించిన వైద్య సిబ్బంది అతడిని స్ట్రెచర్‌పై వెలుపలికి తీసుకువెళ్లారు.వెస్టిండీస్ ఇన్నింగ్స్ 78వ ఓవర్‌లో మెహిదీ హసన్ మిరాజ్ వేసిన బంతిని జస్టిన్ గ్రీవ్స్ షార్ట్ ఫైన్ లెగ్ దిశగా ఆడాడు. బంతిని ఆపేందుకు వేగంగా పరుగెత్తిన ఇస్లామ్ యాంకిల్ ట్విస్ట్ కావడంతో కింద పడిపోయాడు. వెంటనే స్పందించిన బంగ్లా జట్టు ఫిజియో మైదానంలోనే ప్రథమ చికిత్స అందించారు. అయినప్పటికీ నొప్పి తీవ్రత తగ్గకపోగా.. కాలు కదిలించేందుకు కూడా ఇబ్బంది పడ్డాడు. దీంతో వెంటనే ఫిజియో సాయంతో అతడినిస్ట్రెచర్‌పై మైదానం బయటకు తరలించారు.స్థానిక ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ రిపోర్ట్ వచ్చిన తర్వాత ఇస్లామ్ గాయంపై బంగ్లా క్రికెట్ బోర్డు అధికారిక ప్రకటన చేయనుంది. మరోవైపు ఇస్లామ్ గాయం కారణంగా రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగలేకపోవడంతో, అతడి స్థానంలో నయీమ్ హసన్ ఓపెనర్‌గా ఇన్నింగ్స్ ప్రారంభించాడు.

ప్రధానిని కలిసిన సూర్యకుమార్ యాదవ్.. చిన్నారులతో సరదాగా గడిపిన మోదీ..

భారత క్రికెట్ జట్టు మాజీ టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన కుటుంబంతో కలిసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశాడు. శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా సూర్యకుమార్ కుటుంబంతో ప్రధాని మోదీ ఆప్యాయంగా మాట్లాడారు. ముఖ్యంగా సూర్యకుమార్ పిల్లలతో మోదీ సరదాగా గడపడం ఈ సమావేశంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సూర్యకుమార్ యాదవ్ 2026 ఐసీసీ టీ20 ప్రపంచకప్ విజయం సందర్భంగా అందుకున్న బంగారు పతకాన్ని ధరించి ఈ సమావేశంలో కనిపించాడుసూర్యకుమార్ యాదవ్ మెడల్‌ను ప్రధాని మోదీ చేతిలోకి తీసుకుని పరిశీలించారు. ప్రపంచకప్ విజయాన్ని గుర్తుచేసుకుంటూ ఇద్దరూ ప్రత్యేక క్షణాలను పంచుకున్నారు. 2026 టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు టైటిల్‌ను నిలబెట్టుకోవడంలో సూర్యకుమార్ కీలక పాత్ర పోషించాడు. కెప్టెన్‌గా జట్టును ముందుండి నడిపించి మరోసారి ప్రపంచ విజేతగా నిలపడంలో తన వంతు పాత్ర పోషించాడు. ఈ సమావేశంలో సూర్యకుమార్ కుమార్తె రిద్దిమా ప్రధాని మోదీ ముందు భక్తి గీతం ఆలపించింది. చిన్నారి పాటను మోదీ ఆసక్తిగా విన్నారు





బాడీ బిల్డర్‌ని పెళ్లాడుతున్న గాయని.. ఫ్యాన్స్ విషెస్



ప్రముఖ మలయాళ ప్లేబ్యాక్ సింగర్, టీవీ యాంకర్ రిమి టామీ జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోంది. మొదటి భర్తతో విడాకులు తీసుకున్న దాదాపు ఆరేళ్ల తర్వాత.. ఆమె మళ్లీ వివాహ బంధంలోకి అడుగుపెడుతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తన యూట్యూబ్ ఛానెల్ ద్వారా ఈ సంతోషకరమైన విషయాన్ని షేర్ చేస్తూ.. తన జీవితంలోకి సరికొత్త భాగస్వామి వచ్చారని, త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నట్లు వెల్లడించారు. తొలుత తన కాబోయే భర్త వివరాలను దాచిపెట్టిన రిమి టామీ.. ఆ తర్వాత సోమవారం విడుదల చేసిన వీడియోలో అతడి పేరు లిబిన్ మాథ్యూ అని స్పష్టం చేశారు. ముంబైకి చెందిన ఆయన ఒక బాడీబిల్డర్, ఫిట్‌నెస్ ట్రైనర్. పుట్టుకతో మలయాళీ అయిన లిబిన్ గత కొన్ని నెలలుగా రిమి టామీకి ఫిట్‌నెస్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. వీరి వివాహం ఈ నవంబర్‌లో దొంబివ్లీలోని ఒక చర్చిలో కుటుంబ సభ్యుల మధ్య జరగనుంది. తన కాబోయే భాగస్వామి గురించి రిమి టామీ మాట్లాడుతూ..“ఆయన ఏమీ సినీ నటుడు, సింగర్ లేదా కోటీశ్వరుడు కాదు. జీవిత భాగస్వామి అంటే డబ్బు, హోదా ఉన్నవారు కాకూడదు.. మన ప్రశాంతతను పెంచే వ్యక్తి అయి వుండాలి. నా మనసుకు ప్రశాంతతను ఇచ్చి, నన్ను నాలా అర్థం చేసుకునే వ్యక్తి లభించారు. ఇది దేవుడు ఇచ్చిన వరంగా భావిస్తున్నాను“ అని భావోద్వేగానికి గురయ్యారు. రిమి టామీ కెరీర్ విషయానికి వస్తే.. 2002లో లాల్ జోస్ దర్శకత్వంలో వచ్చిన ‘మీస మాధవన్‘ చిత్రంలోని ‘చింగమాసమ్‘ పాటతో గాయనిగా అరంగేట్రం చేసి రాత్రికి రాత్రే స్టార్ సింగర్‌గా మారారు. ఆ తర్వాత అనేక సూపర్ హిట్ పాటలు పాడి నేపథ్య గాయనిగా అలాగే, మలయాళంలో పాపులర్ టీవీ యాంకర్‌గా కూడా పేరు సంపాదించుకున్నారు. 2008లో వ్యాపారవేత్త రాయిస్ కిళక్కుడన్‌ను వివాహం చేసుకోగా.. 11 ఏళ్ల దాంపత్య జీవితం తర్వాత మనస్పర్థల కారణంగా 2020లో పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నారు. ఇప్పుడు 2026లో కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న తరుణంలో అభిమానులు-నెటిజన్లు ఆమెకు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

అజ్ఞాతవాసినే తట్టుకున్న గురుజీకి ఇదొక లెక్క..



త్రివిక్రమ్ శ్రీనివాస్‌కు ‘ఆదర్శ కుటుంబం‘ ఆశించిన స్థాయిలో ఫలితాన్ని ఇచ్చేలా కనిపించడం లేదు. వెంకటేష్‌తో చేసిన ఈ సినిమా విడుదల తర్వాత మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. ఫస్ట్ వీకెండ్‌లో వసూళ్లు వచ్చినప్పటికీ ఆ తర్వాత డ్రాప్ కనిపించింది. అయితే కొందరు ఎలా ఉండే త్రివిక్రమ్.. ఎలా అయిపోయారు అనేలా. మిమ్స్ క్రియేట్ చేస్తున్నారు. కానీ దీన్ని త్రివిక్రమ్ కెరీర్‌లో పెద్ద సంక్షోభంగా చూడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే గతంలో ఇంతకంటే క్లిష్టమైన పరిస్థితి నుంచి బయటపడిన అనుభవం ఆయనకు ఉంది. 2018లో వచ్చిన ‘అజ్ఞాతవాసి‘ త్రివిక్రమ్ కెరీర్‌లో భారీ పరాజయం. పవన్ కల్యాణ్‌తో అప్పటికే రెండు విజయాలు అందుకోవడంతో మూడో సినిమాపై అంచనాలు ఆకాశాన్నంటాయి. కానీ ఫలితం పూర్తిగా తలకిందులైంది. ఆ సమయంలో వ్యక్తిగత జీవితంలోనూ ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు త్రివిక్రమ్ గతంలో చెప్పారు. ఒకవైపు సినిమా పరాజయం, మరోవైపు కాపీ ఆరోపణలు వ్యక్తిగత సమస్యలతో ఆ దశ ఆయనకు చాలా కష్టంగా గడిచింది. అక్కడి నుంచి త్రివిక్రమ్ తీసుకున్న నిర్ణయమే వేరు. ఎన్టీఆర్‌తో ‘అరవింద సమేత‘లో తనకు అలవాటైన కామెడీని తగ్గించి సీరియస్ కథను ఎంచుకున్నారు. రాయలసీమ ఫ్యాక్షన్ నేపథ్యంలో ఎమోషన్స్‌కు ప్రాధాన్యం ఇచ్చారు. ఆ ప్రయోగం మంచి విజయాన్ని అందించింది. తర్వాత అల్లు అర్జున్‌తో ‘అల వైకుంఠపురములో‘ తీసి తన కెరీర్‌లోనే భారీ కమర్షియల్ నక్సెస్ అందుకున్నారు. ంటలవతీబితిబవఎవనిబి ఇప్పుడు ‘ఆదర్శ కుటుంబం‘తోనూ త్రివిక్రమ్ మరో ప్రయత్నం చేశారు. వెంకటేష్ సినిమాలకు గతంలో రచయితగా పనిచేసిన అనుభవం ఉన్నప్పటికీ దర్శకుడిగా మాత్రం ఇదే తొలి సినిమా. పైగా ఈసారి రెగ్యులర్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ కాకుండా క్రైమ్, యాక్షన్ అంశాలను మిక్స్ చేశారు. కానీ ప్రమోషన్ నుంచే ఈ కాంబినేషన్‌పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా ‘నువ్వు నాకు నచ్చావ్‘, ‘మల్లీశ్వరి‘ తరహా వినోదాన్ని ఆశించిన ప్రేక్షకులకు భిన్నమైన సినిమా ఎదురైంది. అయితే రెండు సినిమాల పరిస్థితులను ఒకేలా పోల్చడం కూడా కరెక్ట్ కాదు. ‘అజ్ఞాతవాసి‘ భారీ బడ్జెట్‌తో వచ్చి భారీ నష్టాలను మిగిల్చింది. ‘ఆదర్శ కుటుంబం‘ మాత్రం మొదటి వీకెండ్ లో చెప్పుకోదగ్గ వసూళ్లు సాధించింది. పూర్తి థియేట్రికల్ రన్ ముగియకముందే దాన్ని అదే స్థాయి పరాజయంగా పరిగణించలేం. అంతేకాకుండా అప్పట్లో పవన్ కల్యాణ్ స్టార్‌డమ్‌పై ఉన్న అంచనాలకు, ఇప్పుడు వెంకటేష్‌తో ఉన్న కాంబినేషన్‌పై ఏర్పడిన అంచనాలకు మధ్య తేడా ఉంది. ఇక త్రివిక్రమ్ తదుపరి సినిమా ఎన్టీఆర్‌తో ఖరారైన సంగతి తెలిసిందే. కుమారస్వామి కథకు సంబంధించిన హింట్‌ను దర్శకుడు స్వయంగా ఇచ్చారు. స్క్రిప్ట్ సిద్ధంగా ఉందని కూడా వెల్లడించారు. ఇప్పటివరకు ఫ్యామిలీ, యాక్షన్ కథలతో మెప్పించిన త్రివిక్రమ్‌కు పౌరాణిక నేపథ్యంతో భారీ సినిమా చేయడం కొత్త సవాల్. ప్రస్తుతం ఎన్టీఆర్ ‘డ్రాగన్‘తో బిజీగా ఉండగా, ఆ సినిమా తర్వాత ఈ ప్రాజెక్ట్ సెట్స్‌పైకి వెళ్లేలా సన్నాహాలు జరుగుతున్నాయి.

800 కోట్ల బ్లాక్‌బస్టర్ తర్వాత ఆఫర్ల వర్షం..అయినా రిజెక్ట్ చేసిన హీరోయిన్!



బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్ కెరీర్ విషయంలో ఆచితూచి అడుగులు వేస్తుంటారు. బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టించిన ‘స్త్రీ 2‘ చిత్రం ఘనవిజయం సాధించిన తర్వాత అమ్మడికి భారీ ఆఫర్లు, కోట్లలో రెమ్యునరేషన్లు క్యూ కట్టాయన్నది కాదనలేని నిజం. తాజాగా ఇదే విషయాన్ని అమ్మడు మరోసారి రివీల్ చేసింది. మంచి కథ కోసం సుదీర్ఘంగా వేచి చూసేందుకు సిద్ధపడ్డానే తప్ప ఏ సినిమాకు వెంటనే సంతకం చేయలేదని శ్రద్ధా కపూర్ స్వయంగా వెల్లడించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో నిర్వహించిన క్యూ అండ్ ఏ సెషన్‌లో యువతకు, అభిమానులకు కెరీర్ మార్గదర్శకాలపై సలహాలు ఇస్తూ ఈ విషయాన్ని రివీల్ చేసారు. కెరీర్‌లో సరైన నిర్ణయాలు తీసుకోవడానికి ఎంతో ఓర్పు, నమ్మకం అవసరమన్నారు. ‘స్త్రీ 2‘ తర్వాత ఎదురైన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. భారీ మొత్తంలో డబ్బుతో ఆఫర్లు వచ్చినా? మనసుకు నచ్చే పర్‌ఫెక్ట్ స్టోరీ దొరికే వరకు ఎలాంటి తొందరపాటు నిర్ణయం తీసుకోకూడదని ముందుగానే నిశ్చయించుకున్నట్లు తెలిపారు. సినిమా పరిశ్రమలో ఓ పెద్ద విజయం అందుకున్న తర్వాత తదుపరి ప్రాజెక్టును ఎంచుకోవడంలో చాలా ఒత్తిడి ఉంటుందని ..కానీ ఎలాంటి పరిస్థితుల్లోనైనా? మనసు చెప్పిన మాటకు విలువ ఇవ్వాలని శ్రద్ధా అభిప్రాయపడ్డారు.ఆ వెయిటింగ్ వల్ల ఇప్పుడు తనకు ఎంతో గర్వంగా ఉందని పేర్కొన్నారు. డబ్బు కన్నా కంటెంట్ ప్రధానమని నమ్మే శ్రద్ధ దృక్పథం ఇండస్ట్రీ లో హాట్ టాపిక్‌గా మారింది. అమర్ కౌశిక్ దర్శకత్వంలో తెరకెక్కిన ‘స్త్రీ 2‘ చిత్రం 2024లో బాక్సాఫీస్ వద్ద రికార్డులను తిరగరాసిన విషయం తెలిసిందే. వరల్డ్ వైడ్‌గా 857 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి భారతీయ సినిమా చరిత్రలో అత్యధిక వసూళ్లు సాధించిన హర్రర్-కామెడీ చిత్రంగా చరిత్ర సృష్టించింది. ఈ సక్సెస్ తర్వాత శ్రద్ధా క్రేజ్ ఒక్కసారిగా తారాస్థాయికి చేరింది. దీంతో నిర్మాతలు ఆమెతో వెంటనే సినిమాలు చేయడానికి పోటీ పడ్డారు. అయితే తొందరపడి ఏ ప్రాజెక్ట్‌ను అంగీకరించని శ్రద్ధా కపూర్ ప్రస్తుతం లక్ష్మణ్ ఉటెకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘ఈథ‘ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. మాడాక్ ఫిలింస్ బ్యానర్‌పై రూపొందుతున్న చిత్రంలో ప్రముఖ కళాకారిణి విఠాబాయి భావు మంగ్ నారాయణ్‌గాంకర్ పాత్రలో కనిపించనున్నారు. మహిళా కళాకారిణి ధైర్యసాహసాలు.. ఆమె జీవిత ప్రయాణాన్ని కళ్లకు కట్టే ఈ కథ తనకు ఎంతో నచ్చిందని తెలిపారు. డబ్బు, స్టార్‌డమ్ వెనుక పరుగెత్తకుండా బలమైన కథలకే ప్రాధాన్యత ఇస్తానని శ్రద్ధా కపూర్ మరోసారి నిరూపించారు.



బెల్లంకొండ శ్రీనివాస్.. మళ్లీ ఆ బలాన్నే నమ్ముకున్నారా!

: బెల్లంకొండ శ్రీనివాస్ తన సినిమాల్లో డ్యాన్స్, యాక్షన్‌తో ఎక్కువ హైలెట్ అవుతుంటాడు. ముఖ్యంగా మాస్ సాంగ్స్‌లో అతను స్టెప్పులకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఇప్పుడు ‘టైసన్ నాయుడు‘ కోసం కూడా అదే రూట్ ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. ఈ సినిమా నుంచి మొదటి పాటగా ‘మదరాసి రబ్బరు బొమ్మ‘ను విడుదల చేయబోతున్నారు. పోస్టర్ చూస్తుంటే బెల్లంకొండ నుంచి మరో భారీ డ్యాన్స్ నంబర్ రాబోతున్నట్లు ఉంది. సాగర్ కె. చంద్ర దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో నేహా శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నారు. తొలి పాట పోస్టర్‌లో ఇద్దరినీ మాస్ అవతారంలో చూపించారు. రంగురంగుల సెట్స్, బ్యాక్‌గ్రౌండ్ డ్యాన్సర్లు చూస్తుంటే పాటను భారీగానే తెరకెక్కించినట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా బెల్లంకొండ, నేహా మధ్య కెమిస్ట్రీని హైలైట్ చేసేలా పోస్టర్ డిజైన్ చేశారు. ఇద్దరూ కలిసి చేస్తున్న మొదటి సినిమా కావడంతో ఈ పాటపై ఆసక్తి ఉండే అవకాశం ఉంది. బెల్లంకొండ కెరీర్‌లో డ్యాన్స్‌కు ఎప్పుడూ స్పెషల్ బజ్ ఉంది. ‘అల్లుడు శీను‘ నుంచి ఆయన సినిమాల్లో భారీ సాంగ్స్ కనిపిస్తూనే ఉన్నాయి. కథలు, పాత్రలు మారుతున్నప్పటికీ డ్యాన్స్ విషయంలో మాత్రం తన స్టైల్ కొనసాగిస్తున్నారు. ఇప్పుడు ‘టైసన్ నాయుడు‘లోనూ ఆ గుర్తింపును ఉపయోగించుకుంటున్నట్లు ఉంది. ఫస్ట్ పాటనే మాస్ ఫోక్ నంబర్‌గా తీసుకురావడం హైలెట్. ఇక ఈ పాటకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించడం మరో ప్లస్. ఫోక్ బీట్స్‌తో మంచి ఎనర్జీ తీసుకురావడంలో ఆయనకు పేరుంది. బెల్లంకొండ డ్యాన్స్‌కు అలాంటి సంగీతం తోడైతే మంచి మాస్ నంబర్ వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా పాటలో క్యాచీ హుక్ స్టెప్ ఉంటే సోషల్ మీడియాలోనూ ఉపయోగపడుతుంది. ప్రస్తుతం సినిమా పాటలకు రీల్స్ ద్వారా లభించే బజ్ కూడా కీలకంగా మారింది. అయితే ‘టైసన్ నాయుడు‘ యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కుతున్న సినిమా. బెల్లంకొండను పవర్‌ఫుల్ పాత్రలో చూపించబోతున్నట్లు గతంలో విడుదలైన కంటెంట్ ద్వారా క్లారిటీ ఇచ్చారు. అలాంటి సినిమా ప్రమోషన్స్‌ను యాక్షన్ సన్నివేశాలతో కాకుండా డ్యాన్స్ నంబర్‌తో ముందుకు తీసుకెళ్లడం ఆసక్తికరం. ఆయనలోని మాస్ డ్యాన్సర్‌ను మరోసారి ప్రేక్షకులకు గుర్తుచేసేలా ప్లాన్ చేస్తున్నట్లు అనిపిస్తోంది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ సినిమా ప్రమోషన్స్‌లో ఇప్పుడు పాటల హడావుడి మొదలవుతోంది.



Edited, Printed, Published and Owned by KASHAPAGA SAHITYA, and Printed at THANMAYEE PRINTERS, D.No. 17-2-539,Shop No.7&8,Saidabad,Hyderabad,Telangana and Published at: H.No. 18-7-731, Gowlipura, Chatrinaka, Hyderabad-500053, Telangana.Editor: KASHAPAGA SAHITYA. “RNI No.TELTEL/2015/64243. Cell:7671859219 E-mail Id: iyyalatelangana@gmail.com